ఆదివారం
14-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 292
పేజీలు : 10, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల బీభత్సం

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు 11 మందిని దారుణంగా చంపేశారు. శుక్రవారం నోష్కి జిల్లాలోని హైవేపై వెళ్తున్న బస్సును ఆపి అందులో ఉన్న ప్రయాణికులను తుపాకీతో బెదిరించి తొమ్మిది మందిని కిడ్నాప్ చేశారని పోలీసులు తెలిపారు. అనంతరం వారిని తుపాకీతో కాల్చి హతమార్చినట్లు చెప్పారు. మరో సంఘటనలో అదే రహదారిపై వెళుతున్న కారుపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. నోష్కి హైవేపై 11 మందిని హతమార్చిన ఉగ్రవాదులను క్షమించబోమని, త్వరలోనే వారిని పట్టుకుంటామని బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మీర్ సర్ఫరాజ్ బుగ్తీ తెలిపారు.

# ప్రలోభాల ఎర

- భారీగా మద్యం, ధనం పంపిణీ
- వైసీపీ, ఎన్డీయే పార్టీల ఆగడాలు
- హారతి పడితే రూ.వెయ్యి కానుక
- ఎన్నికలు కార్పొరేట్ మయం
- ప్రచారంలో కొత్త పోకడలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలు ధన ప్రవాహంగా మారుతున్నాయి. ఎక్కడికక్కడే పెద్దఎత్తున మద్యం, డబ్బు నిల్వలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల డబ్బు, మద్యం, బంగారం భారీగా పట్టుపడుతోంది. ఓటర్లను ప్రధాన రాజకీయ పక్షాలు ప్రలోభాలకు గురిచేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం ఇప్పటివరకు అధికారికంగా రూ.100 కోట్లపైబడిన ధనం, మద్యం, ఇతర వస్తులను జప్తు చేయడం సంచలనంగా మారింది. ఇంకా అనధికారికంగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి బంధువుల ఇళ్లల్లో డబ్బులు పేరుకుపోయాయి. వివిధ రూపాల్లోనూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న వారిపై ఎన్నికల సంఘం నిఘా ఉంచాలి. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను పూర్తిగా కార్పొరేట్ మయంగా మారుతున్నాయి. ప్రజా ఉద్యమాల నేతలను ఎదుర్కొనే ధైర్యం లేక, భూర్జువా పార్టీలు కోటీశ్వర్లకు టికెట్లు కట్టబెడట్టడంతోనే ఈ దుస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్పొరేట్ నేతలకు ప్రజాబలం లేక, అడ్డదారుల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ప్రచారంలో భాగంగా తుదకు హారతి పట్టిన మహిళా ఓటర్లకు రూ.1000 లేదా ఆపైన కానుకలను ఇసిరేస్తూ తన ధనబాలాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికార వైసీపీతోపాటు ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీలు చాలా నియోజకవర్గాల్లో ధన బలం ఆధారంగానే టికెట్లను కేటాయించాయి. గతంలో ఎన్నడూలేని కొత్త సంస్కృతిని తీసుకొస్తున్నారు. అంతా డబ్బుతోనే రాజకీయాలు నడిచేలా వ్యవహరిస్తున్నారు. అసమ్మతి నేతలను డబ్బుతో లొంగదీసుకోవడం, ఇతరత్రా తాయిలాలు ప్రకటించడం వంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కొద్దిపాటి పలుకుబడిన నేతలుంటే వారితో సంప్రదింపులు చేయడం, తమ వైపునకు తిప్పుకుంటున్నారు. కేంద్రంలోని మోదీ

- మిగతా 2 లో

## సీఎం జగన్‌పై రాళ్ల దాడి

- ఎడమ కంటిపైన గాయం
- ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లికి కూడా గాయాలు
- విజయవాడ సింగ్‌నగర్‌లో ఘటన

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** సీఎం జగన్‌పై రాళ్ల దాడి జరిగింది. దీంతో ఆయన చేపట్టిన బస్సు యాత్రలో తీవ్ర కలకలం చెలరేగింది. కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజయవాడ సింగ్‌నగర్‌కు శనివారం రాత్రికి చేరుకున్నారు. అక్కడ డాబాకొట్ల సెంటర్‌లో బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తుండగా జగన్‌పై క్యాట్ బాల్‌తో రాళ్ల దాడి చేసినట్లుగా అనుమానిస్తున్నారు. రాయి తగలడంతో సీఎం జగన్ ఎడమ కనుబొమ్మకు గాయమై, రక్తస్రావమైంది. అత్యంత వేగంగా రాయి రావడంతో అది కనుబొమ్మను తాకడంతో గాయమైంది. దీంతో ఆయనను హుటాహుటిన బస్సులోకి భద్రతా సిబ్బంది దించి ప్రథమ చికిత్స చేశారు. కొద్దిసేపటికే సీఎం జగన్ యథాతథంగా బస్సు యాత్రను కొనసాగించారు.

సీఎం జగన్ పక్కనే బస్సుపై ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌కు కూడా గాయమైంది. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే, పక్కా ప్రణాళికతోనే టీడీపీ వర్గాలు ఈ దాడికి పాల్పడినట్లు వైసీపీ ఆరోపిస్తోంది.

## చేనేతకు చేయూత ఇచ్చాం

### కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేశాం: సీఎం జగన్

**విశాలాంధ్ర-మంగళగిరి :** చేనేత వర్గానికి ఏ ప్రభుత్వం చేయని విధంగా వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు 95 శాతం హామీలను ఎగ్గొట్టాడని, చేనేత సహకార సంఘాలకు చేసింది నూటికి రెండు శాతం మాత్రమేనని ఆరోపించారు. మీ బిడ్డ జగన్ 99 శాతం హామీలను అమలుపరిచాడని చెప్పారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శనివారం మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో చేనేత కార్మికులతో జగన్‌మోహన్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ 58 నెలల మన పాలనను మీరు చూశారు. గత చంద్రబాబు పాలనను మీరు చూశారు. చంద్రబాబు చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేసి, ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశాడని విమర్శించారు. ఆప్కోకు కూడా చంద్రబాబు బకాయిలు పడ్డారని చెప్పారు. చంద్రబాబు రంగురంగుల మేనిఫెస్టోతో సూపర్ సిక్స్,

- మిగతా 2 లో

## అమరావతే రాజధాని

- అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ
- ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు
- ఏప్రిల్ నుంచి రూ.4 వేల పింఛన్
- తాడికొండ ప్రజాగళంలో చంద్రబాబు హామీ

**విశాలాంధ్ర-తాడికొండ :** 'మరో రెండు మాసాలు ఓపిక పట్టండి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది... అమరావతి రాజధానిగా ఉంటుంది' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో శనివారం ప్రజాగళం జరిగింది. ఈ సందర్భంగా రాజధాని ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, అమరావతి కోసం మహిళలు త్యాగం చేశారని, మీ త్యాగం వృథా కాదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అంతా అభివృద్ధి జరగాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. విశాఖపట్నంను ఆర్థిక నగరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తాను అధికారంలో ఉండగానే 1995లో సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని, ఆనాడు ఎకరం రూ.లక్ష ఉందని,

- మిగతా 2 లో

అదాని గంగవరం పోర్టు కార్మికుల

## ఆందోళన ఉధృతం

### నాలుగు రోజులుగా పోర్టు కార్యకలాపాలు నిలిపివేత

**విశాలాంధ్ర-పెదగంట్యాడ (విశాఖ):** వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, హామీల అమలు, రిఫరల్ ఆసుపత్రి కోసం అదాని గంగవరం పోర్టు కార్మికులు గత నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళన శనివారం మరింత ఉద్రిక్తస్థాయికి చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించకపోతే పోర్టు కార్యకలాపాలను స్తంభింప చేస్తామని కార్మికులు హెచ్చరిస్తూ పెద్ద ఎత్తున బైఠాయించారు. యాజమాన్యం తక్షణమే తమతో చర్చించాలని, హామీలు అమలు చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. మీడియాతో మాట్లాడుతూ, గతంలో అనేక దఫాలుగా ఆందోళనలు చేపట్టినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గత 15 ఏళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నా న్యాయబద్ధమైన జీతభత్యాలు అందడం లేదనీ, ప్రస్తుతం అధిక ధరలతో బతకడం చాలా కష్టంగా ఉందన్నారు. కనీస ఇంటి అవసరాలు, పిల్లలు చదువులు, మెరుగైన వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతిరోజు విధుల్లోకి వెళ్లిన కార్మికుడు బతికి బయటకు వస్తాడోలేదో అన్న భయాందోళనతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. పోర్టులో విషపూరితమైన దుమ్ము ధూళి మధ్య పనిచేస్తున్నామన్నారు. వైద్యం కోసం గేటు ముందు ఆందోళన చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ పోర్టు జీతాలకు సమాంతరంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, బోనస్ చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు,

- మిగతా 2 లో

## ఏ నిమిషంలోనైనా దాడి

- ఇజ్రాయిల్‌కు ఇరాన్ హెచ్చరిక
- సరుకు రవాణా ఓడ స్వాధీనం
- పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత

ఇజ్రాయిల్ పై ఇరాన్ ఏ క్షణమైనా దాడి చేస్తుందన్న సంకేతాలు పశ్చిమాసియాలో యుద్ధ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య ఏ నిమిషంలోనైనా యుద్ధం సంభవించే పరిస్థితి కనబడుతోంది. ఇజ్రాయిల్‌పై ఏ రాత్రైనా దాడి జరగొచ్చని మరోసారి ఇరాన్ హెచ్చరించింది.

2లో

## బెజవాడలో ఈదురుగాలులతో భారీ వర్షం

చల్లబడిన వాతావరణం... ప్రజలకు ఉపశమనం

6లో

### ఇదీ లోకం!

అది కొత్తరకం లై డిటెక్టర్ సార్, జనానికి మీరేమైనా అబద్ధాలు చెబితే మార్చి నిజం చెప్పేస్తాది.

## మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే

- సీపీఐ ఎంపీ అభ్యర్థి జంగాల
- గుంటూరులో ప్రచారానికి శ్రీకారం

2లో

'ఇండియా' గెలుపు...

## ఏపీ అభివృద్ధికి మలుపు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కూటమి అభ్యర్థులకు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి మద్దతు

2లో

## గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల వెల్లడి

మెయిన్స్‌కు 4,496 మంది అర్హత

27 రోజుల్లోనే ఫలితాలు

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శనివారం విడుదల చేసింది.

2లో

# ఏ నిమిషంలోనైనా దాడి

### ఇజ్రాయిల్‌కు ఇరాన్ హెచ్చరిక
### సరుకు రవాణా ఓడ స్వాధీనం
### పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత

**టెహ్రాన్/జెరూసలెం:** ఇజ్రాయిల్ పై ఇరాన్ ఏ క్షణమైనా దాడి చేస్తుందన్న సంకేతాలు పశ్చిమాసియాలో యుద్ధ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య ఏ నిమిషంలోనైనా యుద్ధం సంభవించే పరిస్థితి కనబడుతోంది. ఇజ్రాయిల్‌పై ఏ రాత్రైనా దాడి జరగొచ్చని మరోసారి ఇరాన్ హెచ్చరించింది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయంపై దాడి ఇజ్రాయిల్ పనేనని ఆరోపిస్తున్న ఇరాన్.. అందుకు ప్రతీకారంగా దాడులు తప్పవని హెచ్చరించింది. 'ఇరాన్ ఏం చేయాలనుకుంటుందో ఇజ్రాయిల్‌కు తెలియదు. ఎక్కడ దాడి జరుగుతుందోనని రాత్రుళ్లు బిక్కుబిక్కుమని చూస్తోంది. ఇప్పటికే చాలామంది షెల్టర్లలోకి పారిపోయారు. అసలైన యుద్ధం కంటే.. ఈ మానసిక, మీడియా, రాజకీయ యుద్ధమే వారిని మరింత భయపెడుతోంది. దీంతో ఇజ్రాయిల్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ సలహాదారు యాహ్యా రహీం సఫావీ పేర్కొన్నారు. ఏప్రిల్ 1న ఇరాన్ ఎంబసీపై జరిగిన దాడి కారణంగా మరణించిన 16 మందిలో సీనియర్ కమాండర్లు మొహమ్మద్ రెజా జహేదీ, మొహమ్మద్ హదీ హాజీ రహీమీ ఉన్నారు. వీరు ఐఆర్‌జీసీ సంబంధిత విదేశీ కార్యకలాపాల విభాగంలో సీనియర్ కమాండర్లుగా వ్యవహరిస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన వార్ మానిటర్ సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. మరోవైపు.. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఓ సరుకు రవాణా నౌకపై దాడికి దిగిన ఇరాన్ కమాండోలు దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయిల్ సంస్థకు చెందిన కార్గో షిప్ ఎంసీఎస్ ఏరీస్‌పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ శనివారం దాడి చేశారు. హెలికాప్టర్ నుంచి దానిపై దిగిన కమాండోలు ఆ ఓడను స్వాధీనం చేసుకున్నారు. యూఏఈ తీరంలోని హోర్ముజ్ జలసంధి సమీపం నుంచి ఇరాన్‌కు మళ్లించారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఆ ఓడను తమ కమాండోలు స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ మీడియా కూడా తెలిపింది. మరోవైపు వందకు పైగా డ్రోన్లు, 150కి పైగా క్షిపణులతో ఇజ్రాయిల్‌పై ఏ నిమిషంలోనైనా విరుచుకుపడేందుకు టెహ్రాన్ సిద్ధమైందని అమెరికా నిఘా వర్గాలు చెప్పడం వల్ల ఆందోళనలు నెలకొన్నాయి.

**ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు**

ఇజ్రాయిల్‌కు అమెరికా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడి చేసే ప్రమాదం ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ అంచనా వేశారు. తాను రహస్య సమాచారం జోలికి వెళ్లటం లేదన్న ఆయన దాడికి ఎంతో సమయం లేదని భావిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ రక్షణకు అమెరికా కట్టుబడి ఉందన్న బైడెన్ దాడి చేయొద్దంటూ ఒక్కపదంతో టెహ్రాన్‌కు సందేశం పంపారు. ఇజ్రాయిల్ తోపాటు తమ బలగాల రక్షణ కోసం విధ్వంసక నౌకలను, అదనపు సైనిక సామగ్రిని పశ్చిమాసియాకు తరలిస్తున్నట్టు బైడెన్ చెప్పారు. ఒకవైపు సైనిక సన్నద్ధత ఏర్పాట్లలో నిమగ్నం కావటం, మరోవైపు ఉద్రిక్తతల నివారణకు దౌత్య ప్రయత్నాలు కూడా అమెరికా తీవ్రతరం చేసింది. మరోవైపు ఇజ్రాయిల్ ఫిరంగిదళంపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ మద్దతు ఉన్న హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్ ప్రకటించింది. దక్షిణ లెబనాన్ లోని ఆగ్రూప్ స్థావరాలపై ఇటీవల నెతన్యాహు సేనలు జరిపిన దాడులపై ప్రతీకారచర్యకు దిగినట్లు హెజ్బొల్లా తెలిపింది. ఇటీవల సిరియాలోని ఇరాన్ కాన్సులేట్ భవనంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసింది. ఆ దాడిలో ఇరాన్ టాప్ కమాండర్లు సహా ఏడుగురు సైనికులు చనిపోయారు. అప్పటి నుంచి ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది.

**ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం**

ఎయిర్ ఇండియా ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ గగనతలం నుంచి విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. ఐరోపా దేశాలకు వెళ్లే విమానాలు ఇరాన్ గగనతలం నుంచి కాకుండా వేరేమార్గంలో మళ్లించినట్లు వెల్లడించాయి. శనివారం ఉదయం లండన్‌కు బయల్దేరిన విమానం ఇరాన్ మీదుగా కాకుండా మరోమార్గంలో వెళ్లినట్లు సమాచారం. దీంతో ఐరోపా దేశాలకు చేరుకోవడానికి ప్రయాణ సమయం రెండు గంటలు పెరగనుంది.

**ఇజ్రాయిల్ కార్గో షిప్‌లో 17 మంది భారతీయ సిబ్బంది**

ఇరాన్ సైన్యం స్వాధీనం చేసుకున్న ఇజ్రాయిల్ కంపెనీ కార్గో షిప్‌లో 17 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. వారి భద్రత, విడుదల కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఇరాన్ పాలకులతోపాటు దిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయంతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది.

## ఆందోళన ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గేట్ పాస్‌లు మంజూరు చేయాలన్నారు. సబ్సిడీతో కూడిన క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. తొలుత పోలీసు బలగాలతో పోర్ట్ యాజమాన్యం కార్మికులను తీవ్ర నిర్బంధానికి గురిచేసింది. దీంతో గంగవరం పోర్టు పూర్తిగా స్తంభించిపోయింది. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అక్రమ చర్యలకు పాల్పడినా, బెదిరించినా, నిర్బంధం ప్రయోగించినా పట్టు సడలకుండా 64 రోజులు పాటు నిర్వాసిత కార్మికులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం.

## గర్భాశయాన్ని అద్దెకు తీసుకోవడం అమానవీయం

### సరోగసీపై ఇటలీ ప్రధాని వ్యాఖ్యలు

**రోమ్:** సరోగసీ ద్వారా మాతృత్వాన్ని పొందడం అమానవీయమని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పేర్కొన్నారు. ఈ విధానంలో జన్మించిన పిల్లల్ని సూపర్ మార్కెట్ ఉత్పత్తులుగా పరిగణిస్తారన్నారు. 'ఒకరి గర్భాన్ని అద్దెకు తీసుకోవడం స్వేచ్ఛాచర్య అని మీరు నన్ను ఒప్పించలేరు. పిల్లల్ని సూపర్ మార్కెట్‌లో ఉత్పత్తిగా పరిగణించడాన్ని ప్రేమ అని మీరు నాకు సర్దిచెప్పలేరు. గర్భాశయాన్ని అద్దెకు తీసుకోవడాన్ని నేను ఇప్పటికీ అమానవీయంగానే భావిస్తాను' అని మెలోనీ వ్యాఖ్యానించారు. దీనిని అంతర్జాతీయ నేరంగా మార్చే బిల్లుకు తన మద్దతు ఉంటుందని చెప్పారు. సరోగసీ ప్రక్రియ ఇప్పటికే ఇటలీలో శిక్షార్హం. అతివాద భావజాలం కలిగిన అధికార పక్షం ఈ నిబంధలను మరింత కఠినతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ విధానం చట్టబద్ధ దేశాల్లో కూడా ఇటలీ ప్రజలు పిల్లల్ని కనకుండా ఈ బిల్లు నిషేధించనుంది. అయితే దీనిని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

## మేయర్‌కు తీవ్ర హెచ్చరికలు

### భారత సంతతి మహిళ అరెస్టు

**వాషింగ్టన్:** భారత సంతతికి చెందిన ఓ మహిళ అమెరికాలోని కాలిఫోర్నియాలోని బేకర్స్‌ఫీల్డ్ మేయర్‌ను తీవ్రంగా హెచ్చరించింది. ఈ ఘటన సిటీ కౌన్సిల్ సమావేశంలో చోటుచేసుకుంది. మేయర్ ఆదేశాల మేరకు తక్షణమే ఆమెను పోలీసులు అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బేకర్స్‌ఫీల్డ్‌లో జరిగిన సమావేశంలో రిద్ధి పటేల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మైనారిటీ ల అణచివేత, ఇజ్రాయిల్-హమాస్ అంశాలను ప్రస్తావించిన ఆమె మేయర్ కరెన్ గోహ్‌పై విరుచుకుపడ్డారు. ఇజ్రాయిల్ గాజాపై దండెత్తిన విషయంలో కాల్పుల విరమణ తీర్మానానికి మద్దతు ఇవ్వనందుకు వారిపై మండిపడ్డారు. అణచివేతకు గురైన మైనారిటీలు హింసాత్మక విప్లవం ద్వారా ఏదో ఒకరోజు మిమ్మల్ని అంతం చేస్తారని నగర అధికారులను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

"హిందూవుల చైత్ర నవరాత్రులు మొదలయ్యాయి. దీన్ని ఆచరించే మేము, గ్లోబల్ సౌత్‌లోని ఇతర ప్రజలు తమ అణచివేతదారులపై హింసాత్మక విప్లవాన్ని విశ్వసిస్తారు. ఒక రోజు ఎవరైనా గిలెటిన్‌తో మీ అందర్నీ చంపేస్తారని ఆశిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యాలయం వద్ద మెటల్ డిటెక్టర్లు, అదనపు భద్రతను ఏర్పాటుచేయడం నిరసనకారులను నేరస్థులుగా చిత్రీకరించే ప్రయత్నమే అంటూ తప్పుబట్టారు. మిమ్మల్ని హత్య చేసేందుకు మీ ఇంట్లో కలుద్దాం అంటూ ప్రసంగాన్ని ముగించారు. ఆమె చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై మేయర్ మండిపడ్డారు. తక్షణమే పటేల్‌ను అరెస్టు చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.

## గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల వెల్లడి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శనివారం విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 27న గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు మొత్తం 1,48,881 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, పరీక్ష రాసిన వారిలో 4,496 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వివిధ కారణాల రీత్యా 567 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు తిరస్కరించారు. గతేడాది డిసెంబరు ఎనిమిదిన గ్రూప్-1 ప్రిలిమ్స్ నోటిఫికేషన్ విడుదలైంది. గ్రూప్-1 కేటగిరీ కింద 81 పోస్టులను ప్రకటించారు. ఇందులో ఏపీ సివిల్ సర్వీస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)కి చెందిన డిప్యూటీ కలెక్టర్లు తొమ్మిది, ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్లు 18, డీఎస్పీ (సివిల్) 26, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్లు ఆరు, కోఆపరేటివ్ సర్వీసెస్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్లు ఐదు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు నాలుగు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మూడు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి పోస్టులు మూడు, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ రెండు, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ రెండు, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, జైళ్ల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది సెప్టెంబరు 2-9 తేదీల మధ్య మెయిన్స్ నిర్వహణకు ఏపీపీఎస్సీ ప్రయత్నిస్తోంది. పరీక్షలు నిర్వహించిన 27 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించారు.

## ప్రలోభాల ఎర

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ధోరణులు మరింత పెరిగిపోతున్నాయి. ప్రతిపక్ష నేతలను ఈడీ, సీబీఐ, ఐటీ దాడుల బెదిరింపులతో లొంగదీసుకుంటున్నాయి. ఎన్నికలకు విలువ లేకుండా పోతోంది. ఎలాగైనా ఎన్నికల్లో అడ్డదారులు తొక్కి గెలవాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాయి. తుదకు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల్లోనూ అత్యధికంగా డబ్బున్న వారికి, పలుకుబడి గల వారికి సీట్లు పరిమితం చేస్తున్నారు.

**గిఫ్టులతో ఎర**

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాబోయే రోజుల్లో వివిధ రూపాల గిఫ్టుల పంపిణీకి వైసీపీ, ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 25 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థి ఎన్నికల్లోకి దిగాలంటే ముందు పార్టీ ఫండ్, ఆ తర్వాత ఎన్నికల్లో ఖర్చులు ఇవ్వాలి. వారు పార్టీకి సుదీర్ఘకాలం నుంచి కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, డబ్బు ఎవరిస్తే వారికే సీటు ఇచ్చిన సంఘటనలున్నాయి. అసెంబ్లీ సీటుకు కనీసం రూ.30 కోట్లు, ఎంపీ సీటు అయితే రూ.200 కోట్లకుపైగా అభ్యర్థి చెల్లించుకోవాల్సిందే. భూర్జువా పార్టీల రంగ ప్రవేశంతో ఈ తరహా విధానాలు అవతరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నుంచి ధనబలం ఆధారంగానే టికెట్లు కేటాయిస్తున్నారు. చట్ట సభలకు వెళ్లాలనుకునేవారికే అధికంగా చోటు దక్కుతున్నది. ఆంధ్రరాష్ట్ర విభజన అనంతరం ఇది మరింతగా పెరిగింది. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ధనమే ప్రధాన కీలకంగా నిలిచింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే ప్రభావం చూపనుంది. చాలా చోట్ల ఎన్ఆర్ఐలను వైసీపీ, ఎన్డీయే కూటమి పార్టీలు ఎన్నికల బరిలో నిలిపాయి. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ, మద్యం తరలింపు వంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఆయా పార్టీ గుర్తులతో కూడిన టీ షర్టులు, వాచ్‌లు, విసనకర్రలు, ఫేస్ మాస్కులు, కీ చైన్లు, హ్యాండ్ బ్యాగ్‌లు, కండువాలు, దుస్తులను ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల ఈ తరహాగా వైసీపీ పంపిణీ చేస్తున్న ఎన్నికల సామాగ్రిని అధికారులు సీజ్ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ నుంచి ఏపీకి కొరియర్ల ద్వారా బాక్సుల్లో డబ్బు కట్టలు పంపిణీ చేస్తూ పట్టుబడిన సంఘటన జరిగింది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా కడియం వద్ద కోటి రూపాయల విలువైన బంగార ఆభరణాలు పట్టుబడ్డాయి. ఈ విధంగా అడ్డదారుల్లో ఉన్న అవకాశాల్ని వినియోగిస్తూ, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ, ఎన్డీయే కూటమి పార్టీలు పనిచేస్తున్నాయి. విజయవాడ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి తన ప్రచారంలో ధన బలాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇంటింటా తిరిగినప్పుడు హారతులు పట్టిన వారికి స్వయంగా వెయ్యి రూపాయలు వేస్తున్నారు.

దీనిపై ప్రత్యర్థి అభ్యర్థులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయన వెనక్కితగ్గారు. మరో రూపంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు సిద్ధమయ్యారు. రాబోయే రోజుల్లో డబ్బు, మద్యం, ఇతర కానుకల పంపిణీని నియమింత్రేలా ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

## అమరావతే రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి అనంతరం నేడు అక్కడ ఎకరం రూ.100 కోట్లు ఉందని చెప్పారు. నేడు దేశంలోనే హైదరాబాద్ ఆదర్శ నగరంగా నిలిచిందని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం సభ ఖర్చు రూ.20 కోట్లు అని, కరుడుగట్టిన ఉగ్రవాది జగన్ అన్నారు. తాను అధికారంలో ఉండగా పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశానని, తద్వారా పట్టిసీమ ద్వారా కృష్ణకు 150 టీఎంసీ నీటిని అందించామని తెలిపారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని నిర్వహిస్తామని, రానున్న ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ నుంచే రూ.4 వేల పింఛన్ అందజేస్తానన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, టీఏ, డీఏలు ఇవ్వటం లేదన్నారు. 26 వేల పోలీసు ఉద్యోగాలు ఏమి అయ్యాయని నిలదీశారు.

రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా మారాయని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నేటికీ ఆరు లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదన్నారు. తాడికొండను వేధిస్తున్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని, కొండ మల్లికార్జున స్వామి దేవస్థానానికి ఘాట్ రోడ్డు నిర్మిస్తామని, అలాగే ఎస్సీలకు ఎకరం భూమి స్మశాన స్థలాన్ని కేటాయిస్తామని, తాడికొండలో ప్రధాన రహదారి వెంట ఇల్లు కోల్పోయిన వారిని ఆదుకుంటామని తెలిపారు.

అలాగే ఫిరంగిపురం కార్మిల్ మాత కొండకు సైతం ఘాట్ రోడ్డును ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి పి.చంద్రశేఖర్, తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## చేనేతకు చేయూత ఇచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

సెవెన్ అంటూ వస్తున్నారని, గతంలో కూడా ముగ్గురు కలిసే వచ్చారని గుర్తుచేశారు. మన ప్రభుత్వం నేతన్న నేస్తం కింద రూ.970 కోట్లు అందజేసిందని, చంద్రబాబు పెట్టిన బకాయిలను కూడా మన ప్రభుత్వమే చెల్లించిందన్నారు. కుప్పంలో కూడా బీసీలే ఎక్కువ... అక్కడా బీసీలకు ఇవ్వరు. కానీ మనం 100 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చాం... 8 మంది మునిసిపల్ చైర్మన్లు చేనేతలకు ఇచ్చాం. 50 శాతం వెనుకబడిన వర్గాలకు టికెట్ ఇచ్చిన ఘనత మనది, దేశ రాజకీయ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అని అన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ చేనేత వర్గానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. చేనేత వర్గానికే రెండు ఎమ్మెల్సీలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఓటు వేసేటప్పుడు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువగా ఉన్నారని ఆర్కేతో మాట్లాడి ఒప్పించి ఇక్కడ సీటు చేనేత సామాజిక వర్గానికి చెందిన మహిళకు (లావణ్య) ఇచ్చామని, బీసీలు ఎక్కువగా ఉన్నప్పటికీ నా వర్గానికి చంద్రబాబు సీటు ఇవ్వరని, ఆయన కుమారుడు నారా లోకేశ్‌కు ఇచ్చారని ఆరోపించారు.

**చేనేతల కోసం నాడు వైఎస్సార్, నేడు వైఎస్ జగన్ : ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు**

వైఎస్ జగన్ రాష్ట్రం అంతా ప్రయాణిస్తూ వివిధ వర్గాలను కలుస్తూ వాళ్ల సమస్యలను తెలుసుకుంటూ వస్తున్నారని, చేనేతల కోసం నేడు ఇక్కడ మనకు అవకాశం కల్పించడం ముఖ్యమంత్రి తీసుకున్న గొప్ప నిర్ణయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. చేనేతలుగా మంగళగిరిలో మనకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. మంగళగిరిలో తయారైన బట్ట మనదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. దేశం నలుమూలల నుంచి మన మంగళగిరి వస్త్రాల కోసం వస్తున్నారన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా రోశయ్యను, నన్ను పిలిచి చేనేత పరిశ్రమ పరిస్థితులు ఏమిటని అడిగారన్నారు. '65 ఏళ్లకు పెన్షన్లు ఇస్తున్నారు. చేనేతలకు 50 ఏళ్లకు పెన్షన్ ఇవ్వాలని కోరాను. అదెలా సాధ్యం అని ఆయన అడిగారు. రంగులు, రసాయనాల వల్ల మామూలు వ్యక్తుల కంటే చేనేత కార్మికులకు 50 ఏళ్లకే త్వరగా వృద్ధాప్యం వస్తుందని చెప్పాం. అది విని వెంటనే ఆయన అందుకు అంగీకరించారు. అలాగే చేనేతల కోసం మేము ఇచ్చిన 17 డిమాండ్లు కూడా నెరవేర్చారు. చేనేతల థ్రిఫ్ట్ ఫండ్‌ను రెట్టింపు చేసిన వ్యక్తి కూడా వైఎస్సారే. అప్పట్లో 8 శాతం చేనేతలు దాచుకుంటే మరో 8 శాతం ప్రభుత్వం ఇచ్చేది. వైఎస్సార్ దాన్ని 16 శాతానికి పెంచడంతో పాటు రిబేట్‌ను పునరుద్ధరించారు. డైస్ అండ్ కెమికల్స్ మీద సబ్సిడీని కూడా ఇచ్చారు. ఆప్కోకి రూ.100 కోట్లు మంజూరు చేశారు. దానివల్లే నేటికీ చేనేత పరిశ్రమ నిలబడింది. మంగళగిరిలో ఇళ్లు లేని చేనేత కార్మికుల కోసం ఏపీఐఐసీ నుంచి 25 ఎకరాల భూమిని ఇచ్చారు. ఇప్పుడు అక్కడ 3 వేల కుటుంబాలు నివసిస్తున్నారు. నేడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో 150 మంది మగ్గాలకు షెడ్లు కూడా వేసాం. నవరత్నాల్లో అన్ని పథకాలకంటే ఎక్కువగా, చేనేతలకు ఇచ్చే పథకంలో మాత్రమే రూ.24 వేలు అందిస్తున్నారు. చేనేత కార్మికుల జీవితాలను బాగుచేసింది నాడు రాజశేఖర్ రెడ్డి, నేడు జగన్‌మోహన్ రెడ్డి' అని తెలిపారు. ఈ సమావేశంలో అయోధ్య రామిరెడ్డి, విడుదల రజిని, ఆళ్ల రామకృష్ణారెడ్డి, గంజి చిరంజీవి, మురుగుడు లావణ్య, కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తిని శివకుమార్, లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, జింక విజయలక్ష్మి, మురుగుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సిడ్నీ మాల్‌లో దారుణం

### కత్తితో ఐదుగురిని చంపిన దుండగుడు

**సిడ్నీ:** ఆస్ట్రేలియా లోని సిడ్నీలో దారుణం చోటుచేసుకుంది. షాపింగ్ మాల్‌లోకి దూసుకొచ్చిన ఓ దుండగుడు అక్కడివారిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిందితుడిపై కాల్పులు జరపడంతో అతడు హతమైనట్లు వెల్లడించారు. మొత్తం 9 మందిపై దుండగుడు కత్తితో దాడి చేయగా... ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మాల్‌లో ఉన్న వారిని సిబ్బంది వెంటనే అక్కడి నుంచి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అటువైపుగా ఎవరూ రావొద్దని హెచ్చరించిన పోలీసులు దాన్ని నలువైపులా చుట్టుముట్టి హంతకుడిని మట్టుబెట్టారు. ఒక వ్యక్తి పెద్ద కత్తితో మాల్‌లో తిరగడం కొన్ని మీడియా దృశ్యాల్లో కనిపించింది. గాయపడిన వ్యక్తులు నేలపై కుప్పకూలిపోయారు. వారిలో తల్లీబిడ్డ ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారి రక్తస్రావాన్ని ఆపేందుకు దుకాణంలోని దుస్తుల్ని ఉపయోగించినట్లు చెప్పారు. దుండగుడు ఏ ఉద్దేశంతో ఈ దాడికి పాల్పడ్డాడో తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే

**విశాలాంధ్ర-గుంటూరు:** దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఇండియా కూటమి బలపర్చిన సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన గుంటూరు నగరంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అడుగడుగునా నగర ప్రజానీకం సాదర స్వాగతం పలికారు. నగరంలోని కొత్తపేట ప్రధాన రహదారిలో నడుచుకుంటూ ప్రచారం నిర్వహించారు. చిరువ్యాపారులు, దుకాణదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులను సైతం ఆయన కలిశారు. ఇండియా కూటమి ఏర్పడటానికి నెలకొన్న పరిస్థితులు, కూటమి గెలుపు అవశ్యకతను వారికి వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించకుంటే నెలకొనే ప్రమాదకర పరిస్థితులను తెలియజేశారు. కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజాసమస్యలపై లోక్‌సభలో గళం వినిపించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల సత్యనారాయణ, ఆకిటి అరుణ్ కుమార్, నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, రావుల అంజిబాబు, మంగా

శ్రీనివాసరావు, చల్లా మరియదాస్, నగర సమితి సభ్యులు జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, పి.జగన్నాథం, ఆకిటి రామచంద్రుడు, కూరాకుల రాంప్రసాద్, యోగయ్య తదితరులు పాల్గొన్నారు. తనతో పాటు గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజక అభ్యర్థి షేక్ మస్తాన్‌వలికి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని జంగాల కోరారు.

## 'ఇండియా' గెలుపు... ఏపీ అభివృద్ధికి మలుపు

**విశాలాంధ్ర-విజయవాడ:** ఇండియా కూటమి గెలుపు... ఏపీ అభివృద్ధికి మలుపు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభివర్ణించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి ప్రకటించింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు శనివారం విజయవాడ దాసరి భవన్‌లో రామకృష్ణను కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన, ప్రజల మనిషిగా సీపీఐ తరపున పోరాడుతున్నారని ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సమైక్యాంధ్ర పరిరక్షణ కోసం సాగిన ఉద్యమాలను కొనియాడారు. నాలుగున్నరేళ్లకు పైగా ఆంధ్రప్రదేశ్ నియంత చేతుల్లో చిక్కిందని, రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, నీటిపారుదల రంగాల అభివృద్ధి అటకెక్కిందన్నారు. ఆంధ్రాను అప్పులప్రదేశ్‌గా మార్చారన్నారు. 25 మంది వైసీపీ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా కేంద్రం మెడలువంచి ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తానని గత ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిన జగన్‌మోహన్‌రెడ్డి ... అధికారం చేపట్టాక మాటతప్పి మడమ తిప్పారని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు కేవలం ఇండియా కూటమితోనే సాధ్యమని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమి గెలుపు-ఏపీ అభివృద్ధికి మలుపు'గా అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో ప్రజా కంటక పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించేందుకు ప్రతి ఒక్కరూ దీక్షబూనాలని పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి ఇండియా కూటమికి సంపూర్ణ మద్దతు తెలపడం హర్షణీయమన్నారు. సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షులు జి.కుమార్ చౌదరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పురోభివృద్ధికోసం ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి నియోజకవర్గంలో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి ప్రచారం చేస్తుందని స్పష్టం చేశారు. రామకృష్ణను కలిసిన వారిలో సమితి నాయకులు వీరేందర్, గౌరీ శంకర్, గోపాలకృష్ణ, రాహుల్, వేణుచారి, కృష్ణ తదితరులున్నారు.

## వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై మరోసారి రాళ్ల దాడి

**లక్నో :** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్-గయ రైల్వే సెక్షన్‌లోని కర్వాండియా రైల్వే స్టేషన్ సమీపంలో బనారస్-రాంచీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వారు. దీంతో ఓ కోచ్ కిటికీ పగిలింది. బనారస్ నుంచి రాంచీకి వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ససారం రైల్వే స్టేషన్ అనంతరం నాలుగైదు కిలోమీటర్ల ప్రయాణం తర్వాత అకస్మాత్తుగా ఓ పదునైన రాయి కోచ్ నంబర్ సీ7 విండోకు తగిలింది. దీంతో కిటికీ అద్దాలు పగిలిపోయాయి. రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత దెబ్బతిన్న కిటికీని రైలు ఎస్కార్ బృందం, ఇతర సిబ్బంది పరిశీలించారు. ఈ విషయంపై ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాళ్ల దాడి సమాచారం మేరకు ససారం స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుశీల్ కుమార్ విచారణ సందర్భంగా రైలు ఎస్కార్ట్ పార్టీని, ఇతర సిబ్బందిని విచారించారని తెలిపారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ససారం స్టేషన్ నుంచి సాయంత్రం 5.52 గంటలకు బయలుదేరిన తర్వాత కొద్దిసేపటికి దాడి చేయడంతో కోచ్ నంబర్ సీ7 కిటికీ అద్దం పగిలిందని చెప్పారు. ఈ విషయమై సీటు నంబర్ 25లో కూర్చున్న అమరేంద్ర కుమార్ అనే ప్రయాణికుడిని సంప్రదించగా... ససారం స్టేషన్‌కు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలోని కరాబండియా స్టేషన్‌కు సమీపంలో అకస్మాత్తుగా పెద్ద శబ్దం వచ్చిందని ఆ తర్వాత... దక్షిణం వైపు అద్దం పగిలిపోయి కనిపించిందని తెలిపారు. అనంతరం రైల్వే సిబ్బంది కూడా కోచ్ వద్దకు చేరుకుని దెబ్బతిన్న గాజును పరిశీలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నామని, త్వరలోనే నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు ఎంఐఎం మద్దతు

**హైదరాబాద్ :** తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకేకు లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎంఐఎం ప్రకటించింది. ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం ఈ విషయం తెలిపారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అన్నాడీఎంకేతో తమ పొత్తు కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి మద్దతు ఇవ్వడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'బీజేపీతో పొత్తుకు అన్నాడీఎంకే నిరాకరించింది. భవిష్యత్తులో ఎప్పుడూ కూడా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోనని కట్టుబడి ఉంది. సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్సీని వ్యతిరేకిస్తామని కూడా హామీ ఇచ్చింది. అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకేకు ఏఐఎంఐఎం మద్దతిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మా పొత్తు కొనసాగుతుంది' అని పేర్కొన్నారు.

# ప్రపంచ కమ్యూనిస్టులారా ఏకంకండి

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ**

**విశాలాంధ్ర-యద్దపాడు:** కమ్యూనిస్టు పార్టీల భావజాలం ఒక్కటేనని, మళ్లీ ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. అన్ని కమ్యూనిస్టు పార్టీల ధ్యేయం ఒక్కటే అయినప్పుడు ఇన్ని పార్టీలు, ఇన్ని జెండాలు అవసరమా, ఒకే జెండా క్రిందకు ఎందుకు రాలేమని ఆలోచన చేయాలన్నారు. పల్నాడు జిల్లా 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే తుమ్మలపాలెం వద్ద గల అమర్ నగర్‌లో శనివారం నిర్వహించిన అమరవీరుల స్మారకోత్సవ సభకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గుంటూరు జిల్లా కార్యదర్శి వేల్పూరు నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని వనజ మాట్లాడుతూ ఒక్క అజెండాతో, ఒకే జెండాతో కమ్యూనిస్టులు ఐక్యత సాధించి ప్రస్తుతం భారతదేశాన్ని పట్టిపీడిస్తూ నియంతృత్వ పోకడలతో పరిపాలన చేస్తున్న బీజేపీ పాలనను రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని పిలుపునిచ్చారు. మతోన్మాద పాలన నుంచి దేశాన్ని విముక్తి చేయాలన్నారు. రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో దేశ అధికార పగ్గాలను స్వాధీనం చేసుకోవాలని, పేద వర్గాలను ఉద్ధరించాలన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ 1950 దశకంలో నైజాం నవాబుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణా సాయుధ పోరాటమని గుర్తు చేశారు. దానిని హిందూ ముస్లిం పోరాటంగా కొందరు అభివర్ణించాలని ప్రయత్నం చేస్తున్నారని, అది అసత్యమని అన్నారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు మన్నవ హరిప్రసాద్, ఎంసీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ మాట్లాడుతూ 70 సంవత్సరాల అనంతరం కూడా ఆనాటి అమరవీరులను స్మరించుకుంటున్నామంటే వారి త్యాగాలు మరువలేనివని, ఆ స్ఫూర్తితోనే యువత ముందుకు సాగాలన్నారు. తుమ్మలపాలెం అమరవీరుల స్మారక ట్రస్ట్ కన్వీనర్ చెరుకూరి సత్యనారాయణ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీల నాయకులు నాగబైరు సుబ్బాయమ్మ, మారుతి ప్రసాద్, పోపూరి సుబ్బారావు, కారుచోల రోశయ్య, జరుగుల శంకర్రావు, పిల్లుట్ల సాంబశివరావు, తోకల కోటేశ్వరరావు, తాళ్లూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జెండా ఎగురవేసి, అమరులకు జోహార్లతో నివాళులర్పించారు. బొంతా భగత్ సింగ్, కె.రోశయ్య విప్లవ గీతాలు ఆలపించారు. అమరుల సమాధుల వద్ద పూలు చల్లి నివాళులర్పించారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఏది?

**రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి**

**ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్**

**విశాలాంధ్ర-అరసవల్లి/కోటబొమ్మాళి(శ్రీకాకుళం):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ యాజమాన్యం పక్షమా...బాధితుల పక్షమా వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల పట్ల తమ వైఖరిని అధికార వైసీపీ, ప్రతిపక్ష ఎన్‌డీఏ కూటమి సహా కాంగ్రెస్, జై భారత్ నేషనల్ పార్టీ కూడా బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్లో ముప్పాళ్ల విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. గతంలో అగ్రిగోల్డ్ బాధితులు మరణిస్తే రూ.3 లక్షల ఇస్తామని చంద్రబాబు చెప్తే...తాము అధికారంలోకి వస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, ఈ మాట చెప్పి ఐదేళ్లు అయినా ఏ ఒక్కరికి రూపాయి కూడా చెల్లించకపోవడం దారుణమని ముప్పాళ్ల అన్నారు. అధికారం చేపట్టిన వారం రోజుల్లో 20 వేల లోపు ఉన్న బాధితులు 14 లక్షల మందికి రూ.1183 కోట్లు అందజేస్తామని జగన్ నమ్మబలికారని ఆరోపించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యంతోపాటు కోర్టుల వ్యవహారాలన్నీ తమ ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారని గుర్తుచేశారు. జగన్ అధికారం చేపట్టారుగానీ...మాట నిలుపుకోలేదని ఆరోపించారు. ఐదేళ్లపాటు ఓపిక పట్టి, ఇప్పుడు అన్ని జిల్లాల నుంచి సీఎం జగన్ క్యాంప్ కార్యాలయానికి పువ్వుల బుట్టలు పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. జగన్‌కు మనస్సు, మానవత్వం ఉంటే ప్రస్తుత జీఓ ప్రకారం రూ.40 కోట్లు విడుదల చేసి 400 మంది మృతుల కుటుంబాలకు పదిలక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తోపాటు నాడు బీజేపీ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, రామ్‌మాధవ్ నిరాహార దీక్షలు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల తరుణంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి అగ్రిగోల్డ్ బాధితులకు సంబంధించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను మేనిఫెస్టోలో చేర్చాలని విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల మంది అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలు ఉన్నాయని, ఆ కుటుంబాల్లో 40 నుంచి 50 లక్షల ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ బాధితులను ఆదుకునేవారికే ఆ ఓట్లు పడతాయని స్పష్టంచేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని అగ్రిగోల్డ్ బాధితుల మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ సభ్యులతోపాటు బాధితులు పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సనపల నర్సింహులు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆరేళ్లమ్మ, డి.గోవింద్, సీపీఐ జిల్లా నాయకుడు చాపర సుందర్‌లాల్, అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడికి వినతిపత్రం అందజేత

అగ్రిగోల్డ్ యాజమాన్యం ఆర్థిక మోసం కారణంగా నష్టపోయిన పది లక్షల మంది బాధితులకు న్యాయం జరిగేలా హామీ ఇస్తూ మేనిఫెస్టోలో పెట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి ముప్పాళ్ల నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమేరకు బాధితులకు న్యాయం జరిగిందని, మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో బాధితులకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. అచ్చెన్నాయుడు స్పందిస్తూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను మేనిఫెస్టోలో చేరుస్తామన్నారు.

# పరిశోధనల అభివృద్ధి ప్రశంసనీయం

**ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మేళనం**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీలో శనివారం మొట్టమొదటి రీసెర్చ్ స్కాలర్స్ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సమ్మేళనంను ప్రారంభించారు. వర్సిటీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ తాతా పర్యవేక్షణలో జరిగిన సమ్మేళనానికి వివిధ యూనివర్సిటీల నుంచి 150 మందికి పైగా పరిశోధక విద్యార్థులు హాజరై తమ అనుభవాలు, పరిశోధన వివరాలు పంచుకున్నారు. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశోధనల అభివృద్ధికి ఎస్ఆర్ఎం వర్సిటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రీసెర్చ్ స్కాలర్స్‌కు ఆయన మార్గనిర్దేశనం చేశారు. వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (విజయవాడ) వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాబ్జి, విజయవాడ ప్లానింగ్ స్కూల్ డైరెక్టర్ శ్రీకొండ రమేశ్, ఎస్ఆర్ఎం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా ప్రసంగించారు. ఎస్ఆర్ఎం తొలి రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌ను ప్రారంభించి మంచి సంప్రదాయానికి తెరతీసిందని ప్రశంసించారు. వర్సిటీ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు కాంగ్రెస్‌లో చేరిక

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు వైసీపీకి రాజీనామా చేసి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. కడప జిల్లా బస్సు యాత్రలో ఉన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో చిట్టిబాబు పార్టీ కండువా కప్పుకున్నారు. ఇన్‌ఛార్జిల మార్పులు, చేర్పుల్లో భాగంగా 25 మంది సిట్టింగ్‌లకు సీట్లు దక్కలేదు. దీంతో అసంతృప్తికి గురైన వారంతా పార్టీని వీడుతున్నారు. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలైన సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం ఉమ్మడిగా పోటీలోకి దిగుతున్నాయి. ఈ మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. అభ్యర్థులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నారు.

# మహిళను మంటల్లోకి తోసిన వైసీపీ నేత

**విశాలాంధ్ర- గాజువాక:** ఖాళీ స్థలం వివాదంలో ఓ వైసీపీ నేత మహిళను మంటల్లో తోసేసిన ఘటన గాజువాకలో చోటు చేసుకుంది. న్యూపోర్టు సీఐ దాలిబాబు వివరాల ప్రకారం... విశాఖ జిల్లా గాజువాక 65వ వార్డు బానోజీతోటలో రాధ (35) నివాసం ఉంటోంది. ఆమె ఇంటి పక్కన కొంత ఖాళీ స్థలం ఉండగా, శుక్రవారం వైసీపీ నాయకుడు లోకనాథం అక్కడ చెట్లు నరికి అగ్గి పెట్టాడు. దీంతో రాధ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ స్థలం తనదని, ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ అతడిని నిలదీసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో లోకనాథం ఆమెపై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగక మంటల్లోకి తోసేయడంతో ఆమె చేతులు, ముఖానికి గాయాలయ్యాయి. బాధితురాలు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది.

# వేట విరామానికి వేళాయె!

**రేపటి నుంచి జూన్ 14 వరకు వేట నిషిద్ధం**

**రెండు నెలలపాటు మత్స్యకారుల ఉపాధికి గండి**

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** నిత్యం సముద్రంలో అలల ఆటుపోట్లతో పోరాడుతూ చేపలవేట సాగిస్తున్న మత్స్యకారులకు వేట విరామ సమయం ఆసన్నమైంది. వేసవిలో చేపల వేట నిషేధం అమల్లోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు వేటను నిషేధించాయి. తూర్పు తీరానికి ప్రధాన కేంద్రంగా ఉన్న విశాఖ చేపలరేవు ద్వారా ఏటా రూ.వేల కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులు ఎగుమతులు అవుతున్నాయి. ప్రస్తుత సీజన్ లో వివిధ రకాల చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తుల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. గత సీజన్‌తో పోల్చితే పదిశాతం మేర పెరిగాయి. ప్రస్తుత సీజన్‌లో 91,240 టన్నుల చేపలు, 27,120 టన్నుల రొయ్యల దిగుబడి వచ్చిందని, వీటి విలువ రూ.రెండు వేల కోట్ల వరకు ఉంటుందని మత్స్యకార శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే తగిన ధర లేక నష్టపోయాయని మత్స్యకారులు చెబుతున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా 700 బోట్లు, మరో వెయ్యి ఇంజిన్ బోట్లు వేట సాగిస్తున్నాయి. వీటిపై ఆధారపడి 13 వేల మంది మత్స్యకారులు ప్రత్యక్షంగాను, పరోక్షంగా మరో 10వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఏటా రెండు నెలలు మినహా మిగిలిన పది నెలలు చేపలరేవు కళకళలాడుతూ ఉంటుంది. ఈ వేట నిషేధ కాలంలో చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తులు జెట్టీలకు రావు. ఈ సమయంలో ఆపరేటర్లు, మత్స్యకారులు బోట్లకు మరమ్మతులు చేసుకోవడం, వలలు అల్లుకోవడం చేస్తుంటారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోటు ఆపరేటర్లకు, మత్స్యకారులకు తగిన సహాయం అందలేదని ఆయా వర్గాలు వాపోతున్నాయి. ఆయిల్ రాయితీ, మత్స్యకార భరోసా బోటు ఆపరేటర్లు, చిన్న బోట్ల యజమానులకు ఇవ్వడంలేదు. టీడీపీ హయాంలో వీరికి ఆయా పథకాలు అందేవని, అప్పట్లో రాయితీపై వలలు, ఇంజిన్లు, చేపలవేటకు వినియోగించే వివిధ రకాల ఉపకరణాలు అందజేసేవారని పలువురు మత్స్యకారులు తెలిపారు. ఫిష్ ఆంధ్రా స్టాల్స్ పేరుతో వ్యాపారాలకు సహాయం అందిస్తామని జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసినప్పటికీ ఈ పథకం ఆరంభ శూరత్వంగా మారిందన్నారు. తుఫాన్లు, ఇతర వైపరీత్యాల సమయంలో బోట్లకు నష్టం జరగ్గా, పరిహారాలు అంతంత మాత్రంగానే అందాయని మత్స్యకారులు వాపోతున్నారు.

# కమలాపురం ఎమ్మెల్యేగా గాలి చంద్రను గెలిపించండి

**ఓబులేసు, ఈశ్వరయ్య పిలుపు**

**విశాలాంధ్ర-కడపరూరల్:** నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసే గాలి చంద్రను కమలాపురం ఎమ్మెల్యేగా గెలిపించి చట్టసభకు పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఓబులేసు మాట్లాడుతూ... రాష్ట్రంలో, దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ రంగ సంస్థలను అదాని ,అంబా నీలకు కట్టబెడుతోందన్నారు. రైతులు రుణమాఫీ చేయమని అడిగితే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెప్తూనే కార్పొరేట్ సంస్థల వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడితే వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థల ద్వారా దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. బీజేపీని వ్యతిరేకించే ముఖ్యమంత్రులను, కాబోయే ముఖ్యమంత్రి, మాజీ ముఖ్య మంత్రు లను జైల్లో నిర్బంధిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పట్టించుకోకుండా వదిలేసిందన్నారు. మూడు రాజధానుల పేరుతో అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేదని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేయలేదని, రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సీటిపారుదల ప్రాజెక్టు ఏ ఒక్కటి కూడా పూర్తి కాలేదన్నారు. ఇవేవీ చేయకుండా దోపిడీ దౌర్జన్యాలకు, భూ ఆక్రమణలకు, మైనింగ్ మాఫియా, హత్యా రాజకీయాలకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని మండి పడ్డారు. కమలాపురం ఎమ్మెల్యేగా ప్రజలకు అందు బాటులో ఉండే సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. వెంకట శివ, బషీరున్నీసా, వీరశేఖర్, జి.వేణు గోపాల్, సి.సుబ్రమణ్యం, కేసీ బాదుల్ల, వి.గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు ఆవుల వెంకట శివరాం, బి.వెంకట రాములు, జి. వలరాజు, నాగేశ్వరావు, బ్రహ్మం పాల్గొన్నారు.

# ఆయారాం... గయారాంల హడావుడి

**నిత్యం కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీల నేతలు**

**కర్నూలు జిల్లా కొత్త రాజకీయం**

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు:** రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో పాటు అన్ని పార్టీలు అభ్యర్థులను నిర్ణయించి ప్రకటనలు చేస్తుండటంతో రాజకీయ వేడి మొదలైంది. పార్టీలో సీటు రాని నాయకులు... అలాగే రకరకాల కారణాల వలన టీడీపీ, వైసీపీలో నుంచి బయటకు పోయేవారు పోతుంటే వచ్చేవారు వస్తుం డటంతో ఆయారాం... గయారాంలతో పార్టీ కార్యాలయాలు కొత్త సమీకరణలతో కళకళలాడుతున్నాయి. కర్నూలు జిల్లాలో పార్టీ మారిన వారి సంఖ్య ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేల స్థాయి వారితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పార్టీలు మారుతూ ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీకి చెందిన ఆలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ సంజీవకుమార్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు, అధికార పార్టీకి చెందిన పెద్దఎత్తున ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు టీడీపీలో చేరగా, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మ, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, నాయకులు వైకుంఠం మల్లికార్జున, మాజీ జడ్పీటీసీలు, నాయకులు వైసీపీలో చేరగా, బీజేపీ నాయకుడు భూమా కిషోర్ శేఖర్ రెడ్డి వైసీపీలో చేరారు. అధికార పార్టీకి చెందిన నందికొట్కూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల వేళ కావడంతో అనేక మంది వివిధ పార్టీల్లో సీటు ఆశించి పార్టీలు మొండిచెయ్యి చూపించడంతో మరో పార్టీలో చేరడం ప్రస్తుతం సర్వసాధారణమైంది. చొక్కాలు మార్చినంత సులువుగా పార్టీలు మారుతున్నారు. టీడీపీలో చేరిన నేతలు... అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్ సమక్షంలో, వైసీపీలో చేరిన నేతలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ నేతలు ఇతర పార్టీల వారిని తమ పార్టీలోకి ఆహ్వానిస్తూ చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నేతలు పార్టీలు... మారిన వారిని పోలీసులతో ఫోన్‌ల ద్వారా బెదిరించి తిరిగి సొంత గూటికి చేరాలని, లేనిపక్షంలో కేసులు పెడతామని భయాందోళనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎవరు, ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో కూడా తెలియని పరిస్థితితో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

# రాజధానిపై బీజేపీ నాటకం బట్టబయలు: సీపీఎం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాజధానిపై బీజేపీ నాటకం బట్టబయలైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేయడానికి 2022లో నిర్ణయించి నప్పటికీ, తాత్సారం చేసిన ఆర్‌బీఐ ఇప్పుడు తాజాగా రాజధాని ఎక్కడో తేల్చాకే నిర్ణయిస్తామని పేర్కొనడం రాష్ట్ర ప్రజల్ని మోసగించడమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా గతంలోనే కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేయడంతోపాటు పార్లమెంటులో చాలాసార్లు తెలిపిందని ఆయన గుర్తుచేశారు. అయినా ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు దాన్ని ఒక షరతుగా పేర్కొనడం అసంబద్ధమని తెలిపారు. మూడు రాజధానుల పేరిట వైసీపీ ప్రభుత్వం చేసిన గందరగోళాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏనాడు వ్యతిరేకించలేదన్నారు. పైపెచ్చు రాష్ట్ర ప్రభుత్వం ఇష్టమన్న రీతిలో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, రాజధాని అమరావతికి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు మోదీ గుమ్మరించి పోయారని పేర్కొన్నారు. ఆ నాటి నుంచి, రాజధానిపై అస్పష్టత కొనసాగడంతో బీజేపీ దొంగనాటకాలు ఆడుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా వాటికి తెరదించి, రాష్ట్రంలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సహకార సంస్థలను కాపాడుకుందాం

**సామాన్యుల విశ్వాసం చూరగొనాలి**

**నాఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు**

**విశాలాంధ్ర -నూజివీడు టౌన్:** సహకార వ్యవస్థ సమాజం, మానవ జీవితంతో ముడిపడి ఉందని, సామాన్య ప్రజలే లక్ష్యంగా సహకార సంస్థలు పనిచేయాలని విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, నాఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు అమర్ భవన్‌లో శనివారం కృష్ణా జిల్లా సహకార బ్యాంక్, ఫ్యాక్స్ ఉద్యోగుల సంయుక్తాధ్వర్యంలో నాఫ్కాప్ డైరెక్టర్‌గా ఎన్నికైన రాఘవేంద్రరావుకు ఆత్మీయ సన్మానం జరిగింది. సహకార భూమి పత్రిక సంపాదకుడు రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో రాఘవేంద్రరావు మాట్లాడుతూ సంస్థను నడిపే వారి నిజాయితీ, సిబ్బంది పాత్ర, సభ్యుల చైతన్యం ప్రాతిపదికపై సహకార సంస్థల మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఒకరి కోసం అందరం అందరి కోసం ప్రతి ఒక్కరు అన్న సిద్ధాంతంతో పనిచేస్తే సహకార వ్యవస్థకు మరణం ఉండదు అన్నారు. సహకార సంస్థలు మనుగడ సాగించాలంటే స్వతంత్రంగా వ్యవహరించాలని, ప్రభుత్వాల సహకారం కోసం చూడకూడదని నాటి ప్రధాని నెహ్రూ పేర్కొన్నారని గుర్తు చేశారు. దేశంలోని 1,502 అర్బన్ బ్యాంకులు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకోలేదని ఆయన తెలిపారు. సభ్యుల నమ్మకంపై సహకార బ్యాంకులు నడుస్తున్నాయని సహకార సంస్థలో ఎక్కడో ఒకచోట తప్పు జరిగితే మొత్తం కో-ఆపరేటివ్ వ్యవస్థను తప్పు పట్టడం భావ్యం కాదన్నారు. ప్రజలకు విశ్వాసం కలిగించి సహకార సంస్థలను కాపాడుకోవాలని, ప్రజాసేవను పక్కనపెట్టి పెత్తనం కోసం అర్రులు చాచడం మంచిది కాదన్నారు. సహకార సంస్థలు ప్రజలకు ఉపయోగపడేవని సామాన్య ప్రజల లక్ష్యంగా సహకార సంస్థలు పనిచేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు తలా తోకలేని సవరణలు చేస్తూ సహకార వ్యవస్థను చెప్పు కింద తేలులా ఉంచాలని ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఏదో ఒక సాకుతో సహకార సంస్థలను వదిలించుకోవాలని రిజర్వ్ బ్యాంకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. సహకార సంస్థలు ప్రజల సంస్థలుగా ఉండాలని ఖాతాదారులు ఉంటేనే ఉద్యోగులు ఉంటారన్నారు. ఉద్యోగుల అభివృద్ధి సంస్థ పెరుగుదలతో ముడిపడి ఉంటుందని, సంస్థ మనుగడ విషయంలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పేర్కొన్నారు. తమ విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఏర్పడి 109 ఏళ్లు అయిందనీ, రాష్ట్రంలో 46 అర్బన్ బ్యాంకుల్లో 21అర్బన్ బ్యాంకులు 100 సంవత్సరాలకు పైగా కార్యకలాపాలు సాగిస్తున్నాయన్నారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకులో సభ్యుల సంఖ్య లక్ష దాటిందని, 40 సంవత్సరాలు ఖాతాదారులకు డివిడెండ్ పంచిన ఘనత సొంతం చేసుకుందన్నారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ దక్షిణ భారతంలో ప్రథమ స్థానంలో నిలిచి దేశంలో 27 రాష్ట్రాల్లో అతిపెద్ద అర్బన్ బ్యాంక్ గా అవతరించిందన్నారు.

రత్న ప్రసాద్ మాట్లాడుతూ నాఫ్కాబ్ డైరెక్టర్, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేంద్రరావు నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ రంగబాబు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సహకార రంగంలో మరింత మెరుగైన ఉన్నత పదవులు అధిరోహించి దేశంలో సహకారంగ కృషి చేయాలని ఆకాంక్షించారు. విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ కోపరేటివ్ బ్యాంకు సహకార విలువలతో ఖాతాదారులకు సేవలు అందిస్తుంది అన్నారు. సభ్యుల డిపాజిట్ల సంరక్షణతో పాటు ఏ బ్యాంకు నిర్వహించని విధంగా ప్రతివారం పాలకవర్గ సమావేశం నిర్వహిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. కేడీసీసీ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, కో-ఆపరేటివ్ ఉద్యోగుల సంఘ నాయకుడు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు సోమశేఖర్, రాయంకుల లక్ష్మణరావు ప్రసంగించారు. అనంతరర్ ఉద్యోగ సంఘాల నాయకులు రాఘవేంద్రరావు ను సత్కరించారు.

సంపాదకీయం

# యుద్ధ రంగంలోకి ఇరాన్

ఆరు నెలలుగా పలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధ రంగంలోకి ఇరాన్ కూడా ప్రవేశించే అవకాశం కనిపిస్తోంది. ఇజ్రాయిల్ ఏప్రిల్ ఒకటవ తేదీన సిరియాలోని డెమాస్కస్‌లో ఉన్న ఇరాన్ రాయబార కార్యాలయం మీద దాడి చేసింది. ఈ దాడిలో ఇరాన్ దళాలకు చెందిన ఏడుగురు మృతి చెందారు. ఇందులో ఇద్దరు జనరల్ స్థాయి సైనికాధికారులు కూడా ఉన్నారు. అప్పుడే ఇరాన్ ఏదో ఒక రోజు పగ తీర్చుకుంటాం అని ప్రకటించింది. ఇరాన్ విప్లవ దళాలు శనివారం పర్షియన్ సింధు శాఖలో ఇజ్రాయిల్‌తో సంబంధం ఉందంటున్న సరుకు రవాణా నౌక ఎంసీఎస్. ఏరిస్ ను ఇరాన్ నౌకాదళం ప్రత్యేక దళాలవారు స్వాధీనం చేసుకున్నారు. హెలీకాప్టర్ల మీంచి తాళ్ల సహాయంతో ఆ సరుకు రవాణా మీదకు దూకి ఆ నౌకను ఇరాన్ సముద్రజలాల వేపు వంపించారు. ఈ విషయాన్ని ఇరాన్ అధికార వార్తా సంస్థ ధ్రువీకరించింది. ఈ నౌకకు ఇజ్రాయిల్‌తో సంబంధం ఉన్నదని ఇరాన్ అంటోంది. ప్రపంచ వాణిజ్యానికి ఉపయోగపడే హోర్ముజ్ జలసంధి దగ్గర ఈ నౌకను స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీరంలో ఈ నౌకను స్థానిక అధికారులు స్వాధీనం చేసుకున్నారని సముద్రయాన భద్రతకు సంబంధించిన రెండు సంస్థలు ప్రకటించిన తరవాత ఆ వార్తను ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించింది. గత ఏడాది అక్టోబర్ ఏడున ఇజ్రాయిల్ పలస్తీనియన్లకు ప్రాతినిధ్యం వహించే హమాస్‌పై యుద్ధం ప్రారంభించిన దగ్గర్నుంచి ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించే వర్గాలకు, దళాలకు ఇరాన్ పరోక్షంగా సహాయం అందజేస్తోంది. కానీ ఇంతవరకు ప్రత్యక్షంగా యుద్ధ రంగంలోకి దిగలేదు. ఇప్పుడు ఇజ్రాయిల్‌తో సంబంధం ఉందంటున్న సరుకు రవాణా నౌకను స్వాధీనం చేసుకోవడంతో ఇరాన్ ప్రత్యక్షంగా యుద్ధ రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. అంబ్రే అనే భద్రతా సంస్థ ముగ్గురు వ్యక్తులు సరుకు రవాణా నౌక మీద దిగుతుండగా చూశామని తెలియజేసింది. హోర్ముజ్ జలసంధిలో నౌకలను స్వాధీనం చేసుకోవడానికి ఇరాన్ విప్లవ బలగాలు ఇలాగే హెలీకాప్టర్ల ద్వారా ఆ నౌకల మీదకు దిగిన ఉదంతాలు ఉన్నాయని ఆంబ్రే సంస్థ అంటోంది. నౌకల రాకపోకలను పరిశీలించే వెసెల్ ఫైండర్ డాట్ కాం, మెరైన్ ట్రాఫిక్ డాట్ కాం ఎం.ఎస్.సి. ఏరీస్ నౌకపై పోర్చుగీసు జెండా ఉందని చెప్తున్నాయి. ఈ రెండు వెబ్ సైట్లు పర్షియన్ సింధుశాఖలో నౌకల రాకపోకలను పరిశీలిస్తూ ఉంటాయి. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్, లెబనాన్, సిరియా, ఇరాక్‌లోని వివిధదళాలు ఇప్పటికే పరోక్షంగానో, ప్రత్యక్షంగానో హమాస్‌కు మద్దతు ఇస్తూనే ఉన్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్‌లోని హైతి తిరుగుబాటుదార్లు ఎర్ర సముద్రంలో నౌకలమీద అనేకసార్లు డ్రోన్లతో దాడిచేశారు. హైతీలు గత నవంబర్‌లో ఇజ్రాయిల్‌తో సంబంధం ఉన్న గలాక్సీ లీడర్ అనే సరుకు రవాణా నౌకను స్వాధీనం చేసుకున్నారు. నౌకను స్వాధీనం చేసుకున్నప్పుడు బందీలుగా పట్టుకున్న వారిని ఇప్పటికీ విడుదల చేయలేదు. ఇరాన్ ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న హమాస్‌కు మద్దతు ఇస్తున్నప్పటికీ గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయిల్ మీద ఆకస్మికంగా జరిగిన రాకెట్ల దాడితో తమకు సంబంధం లేదని చెప్తోంది. గత జనవరిలో ఓమన్ తీరంలో ఒక నౌకను ఇలాగే ఇరాన్ స్వాధీనం చేసుకుంది. అమెరికా తమ చమురు "దొంగిలిస్తోంది" అని ఇరాన్ వాదించింది.

డెమాస్కస్ లోని ఇరాన్ రాయబార కార్యాలయం మీద ఇజ్రాయిల్ దాడి చేసినప్పటి నుంచే ఇరాన్ ఎదురు దాడి ప్రారంభించవచ్చునన్న అంచనాలు ఉన్నాయి. ఇరాన్ కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటుందని అమెరికాతో పాటు ఇతర గూఢచార సంస్థలు అంచనా వేశాయి. ఇరాన్ బహిరంగంగా యుద్ధ రంగంలోకి దిగితే ప్రస్తుత యుద్ధం ప్రాంతీయ యుద్ధంగా మారక తప్పదు. పర్షియన్ సింధు శాఖలో ఉన్న అనేక దేశాలు అమెరికాకు వత్తాసు పలుకుతున్నప్పటికీ ఇరాన్ మినహా అన్నీ అరబ్ దేశాలే కనక యూదు ఉగ్రవాద రాజ్యం అయిన ఇజ్రాయిల్ మీద గుర్రుగానే ఉన్నాయి. జాతి సమస్య వచ్చేటప్పటికి ఈ దేశాలన్నీ ఏకమైనా ఆశ్చర్యపడనవసరం లేదు. ఇరాన్ భూభాగం నుంచి యూదు రాజ్యం అయిన ఇజ్రాయిల్ మీద, దానికి మద్దతు ఇస్తున్న దేశాల మీద ఇరాన్ దాడికి దిగే అవకాశం ఉందని వాల్ స్ట్రీట్ జర్నల్, బ్లూంబర్గ్ పత్రికలు వార్తా కథనాలు ప్రచురించాయి. డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడి చేయవచ్చుననుకుంటున్నారు. ఇరాన్‌కు ఆయుధ సంపత్తికి కొదవ లేదు. రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగిన క్షిపణులు ఇరాన్ దగ్గర ఉన్నాయి. 1948లో ఇజ్రాయిల్ అవతరించిన దగ్గరి నుంచి ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద, అరబ్బుల మీద దాడి చేస్తూనే ఉంది. గత అక్టోబర్‌లో హమాస్ రాకెట్లతో దొంగ దెబ్బ తీసిందని ఆరోపిస్తూ పలస్తీనియన్లను అంతమొందించే ప్రయత్నం చేస్తోంది. గాజా నగరాన్ని ఇప్పటికే సర్వ నాశనం చేసింది. ఇటీవల ఐక్యరాజ్య సమితి రంజాన్ సందర్భంగా యుద్ధ విరామం పాటించాలని తీర్మానించినా ఇజ్రాయిల్ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇజ్రాయిల్ తీవ్రవాద రాజ్యంగా మారడానికి అవసరమైన ఆయుధ సంపత్తి సమకూరుస్తున్న అమెరికా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను సమర్థిస్తూనే ఉంది. ఇజ్రాయిల్‌కు అపారంగా ఆయుధాలు సరఫరా చేస్తోంది. ఇప్పుడు కూడా ఇజ్రాయిల్ అక్రమ యుద్ధాన్ని ఆపమని కోరడం లేదు. ఇరాన్ ను మాత్రం యుద్ధ రంగంలోకి దిగకూడదంటోంది. ఒక వేళ ఇరాన్ ప్రత్యక్షంగా యుద్ధ రంగంలోకి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తోంది. హుటాహుటిగా యుద్ధం జరుగుతున్న ప్రాంతంలోని ఇజ్రాయిల్, అమెరికా దళాలకు ఆయుధాలు సరఫరా చేస్తోంది. మధ్యధరా సముద్ర తూర్పు ప్రాంతంలోకి నౌకా విధ్వంసక యుద్ధ శకటాలను పంపించింది. అమెరికా దళాలకు రక్షణగా ఆయుధాలు పంపిస్తున్నామని అమెరికా చెప్పడం పచ్చి బూటకం. అసలు యుద్ధం జరుగుతున్న ప్రాంతాలలో అమెరికా సైనిక దళాలకు పనేముంది అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. యుద్ధ రంగంలోకి దిగకుండా ఇరాన్‌ను నివారించడానికి స్విట్జర్లాండ్ ద్వారా అమెరికా సందేశాలు పంపుతోంది. ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, ఖతార్ లాంటి దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా దుష్ట పాత్రే లేకపోతే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ విర్రవీగే అవకాశమే ఉండేది కాదు. యుద్ధం లేకపోతే ఆయన ఇప్పటికే పదవీచ్యుతుడయ్యే వాడు.

# మోదీ అవినీతి వేట- కమలం కండువాలకు బాట

సవ్యసాచి

మోదీ ఎన్నికల ప్రచారం జోరు పెంచారు. ఒక్కొక్క అస్త్రాన్ని బైటకు తీస్తున్నారు. రాముణ్ణి తన చెంతను చేర్చుకున్నారు. అయోధ్యలో తాను ప్రాణప్రతిష్ట చేస్తే ప్రతిపక్షాలు బహిష్కరించడం రాముణ్ణి అవమానించడం కాదా! రాముణ్ణి కాదన్న వారికి ఈ దేశ ప్రజలు ఓటేస్తారా ! అంటూ తన ఓటు భక్తిని చాటుతున్నారు. రాముడి ప్రాణ ప్రతిష్టకు మోదీ చేస్తున్న తీరు హిందూ ధర్మ నియమాలకు విరుద్ధం అంటూ నలుగురు పీఠాధిపతులు బహిరంగంగా ప్రకటించి బహిష్కరించారు. మోదీకి హిందూ ధర్మ నియమాలు పట్టవు. ప్రతిపక్షాలు చెప్పే లౌకిక రాజ్యాంగ నీతి పట్టదు. అనుచిత మార్గాల్లో మోదీ రాముణ్ణి చెరపట్టారు. ఓట్ల కోసం ఏటీఎం గా వాడేస్తున్నారు. అవినీతి మీద తాను యుద్ధం చేస్తుంటే ప్రతిపక్షాలు వారి కొమ్ముకాస్తున్నా యని ప్రతి సభలోనూ ఆరోపిస్తున్నారు. ప్రజలు గతాన్ని మరిచిపోతా రన్నది మోదీ నమ్మిక. వర్తమానానికి ముసుగేసి ఉజ్వల భవిష్యత్‌తో ప్రజల్ని ఆకట్టుకోవాలన్నది ఆయన రాజనీతి. సరిలేరు నా కెవ్వరు అన్నట్టు మోదీ 'రాజనీతి పాండిత్యం' ముందు అందరూ బలాదూరే ! ఆయన చదివింది ప్రపంచంలో మరెవ్వరూ చదవలేదు. "ఎంటైర్ పొలిటికల్" సైన్స్‌లో ఆయన మాస్టర్. ఇలాంటి డిగ్రీ ఇప్పటి వరకు మోదీకి తప్ప మరెవరికీ దక్కలేదు. ఈ డిగ్రీ నిజమో కాదో తెలియదు కాని ప్రపంచంలో దానికి అర్హుడు మోదీజీనే. 2014 ఎన్నికలలో మోదీ ఓట్ల కన్ను విదేశాలలో

మూలుగుతున్న భారతీయ నల్లధనం మీద పడింది. దానిని ఎన్నికల ప్రచార అస్త్రంగా మల్చుకు న్నారు. చేతగాని కాంగ్రెస్ దానిని తేలేకపోయింది. నేను తెచ్చి ఆ సొమ్ముతో అందరి ఖాతాలలో 15 లక్షలు దిమ్మరిస్తానన్నారు. దశాబ్దం గడిచింది. ప్రపంచం అంతా తన చుట్టూనే తిరుగుతుందని డంబాలు పలికే మోదీ చిల్లి గవ్వ కూడా తేలేదు. తర్వాత దేశంలో లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికి తీస్తానన్నారు. పెద్దనోట్ల రద్దుతో దానిని ఖతం చేస్తానన్నారు. పెద్ద నోట్లు రద్దు చేశారు. ప్రజలను క్యూలలో నిలబెట్టారు. తన తల్లిని కూడా క్యూలో నిలబెట్టి గంపలకొద్దీ సానుభూతిని పోగేసుకున్నారు. అదానీలు, అంబానీలు క్యూలో నిలబడలేదు. వారి వ్యాపారాలు స్తంభించి పోలేదు. క్యూలో నిలబడ్డ సామాన్యులు 200 మంది బలైపోయారు. చిన్నా చితకా కంపెనీలు మూతపడ్డాయి. ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది రోడ్డున పడ్డారు. 50 రోజులలో ఫలితాలు రాకపోతే తనను ఉరి తియ్యమని మోదీ ప్రకటించారు. నెలలు గడి చాయి. వస్తున్నదనుకున్న నల్లధనం, తెల్లధనంగా ప్రత్యక్షమైంది. మోదీ ఉరికంబం ఎక్కలేదు. ఈ విషాదాంత చిత్రానికి నిర్మాత, దర్శకుడు మోదీజీనే పార్టీల ఎన్నికల నిధులలో నల్లధనం ఛాయ తొలగిస్తానంటూ మరో ప్రహసనానికి మోదీ తెరతీశారు. దీనికోసం ఒక వక్ర మార్గాన్ని మోదీ కనిపెట్టారు. ఎన్నికల బాండ్ల చట్టం తెచ్చారు. ఎవరైనా బాండ్లు కొనచ్చు. ఎంతకైనా కొనచ్చు. ఏ పార్టీకైనా ఇవ్వవచ్చు. ఎవరు కొన్నారో, ఎవరికిచ్చారో మాత్రం బ్రహ్మ రహస్యం. ఒక్క స్టేట్ బ్యాంకుకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎన్నికల బాండ్ల భాగోతం బట్టబయలైంది. మోదీ చెప్పిన నీతి మేడిపండు పొట్ట పగిలింది. అవినీతి సొమ్ము వికటాట్టహాసం చేస్తూ బైటకొచ్చింది. ఈ దందాలో సింహభాగం బీజేపీ దక్కించుకుంది. ఇందులో ఒకవైపు దుర్జనకాండ. మరొకవైపు క్విడ్ ప్రోకో. మొదటి దుర్జనకాండలో మోదీ ప్రభుత్వం ఎంపిక చేసిన కంపెనీల మీద ఐటీ సోదాలు, ఈడీ నోటీసులు జారీ చేయిస్తుంది. బాధితులు బాండ్లు సమర్పించడంతో ఈ దుర్జనకాండ ముగుస్తుంది. రెండోది క్విడ్ ప్రోకో అంటే గాలంవేసి చేపను పట్టడం. మోదీ ప్రభుత్వం కొందరికి ప్రాజెక్టుల్ని దఖలు పరుస్తుంది. ప్రయోజనం పొందిన వారు ఎన్నికల బాండ్లను బీజేపీ పార్టీకి ఇచ్చుకుంటారు. ఇలా బీజేపీ నల్లధనాన్ని కొన్ని కంపెనీల ద్వారా, డొల్ల కంపెనీల ద్వారా ఆదాయం లేని కంపెనీల ద్వారా వేల కోట్లు కొల్లగొట్టింది. ఎన్నికల బాండ్ల వ్యవహారాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణం అంటున్నారు. మోదీ మాత్రం కుంభకర్ణుడిలా వ్యవహరిస్తున్నారు. అవినీతి పరులు లేని భారతదేశం తన ఆదర్శంగా మోదీ నిత్య ప్రవచనం వినిపిస్తున్నారు. దీనిని వాస్తవం చేయడానికి బీజేపీ ఒక పంకజ్ వాషింగ్ మెషీన్‌ను రూపొందించింది. బురద నుంచి జన్మించిన పంకజానికి అవినీతి బురదను దిగమింగే శక్తి ఉన్నదని నిరూపిస్తున్నారు. మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతల మీద ఐటీ, ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తుంది. లొంగని వాళ్లను జైలుకు పంపుతుంది. లొంగిన వాళ్లను పంకజ్ మిషన్ "పరిశుద్ధులను" చేస్తుంది. పార్టీ కండువాలు కప్పి పరివారంలో కలిపేస్తుంది. వారిని బీజేపీ నేతల్ని చేస్తుంది. ఎన్నికలలో అభ్యర్థులను చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో సుజనా చౌదరి, సీఎం రమేష్‌లు ఇలా కండువాలు కప్పుకుని పునీతులైన వారే. కేసులనుండి ఒడ్డున పడి ఇప్పుడు బీజేపీ అభ్యర్థులుగా బరిలోకి వచ్చిన వారే. దేశంలో ఇలా కమలం కండువాలు కప్పుకుని పునీతులైన వారి సంఖ్య బహుళంగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. మరో ఐదేళ్లు మోదీకి అధికారం ఇస్తే దేశంలో ఎక్కడా కంచు కాగడా పెట్టి వెదికినా అవినీతి పరులు వుండరు. ఎందుకంటే కమలాన్ని ప్రశ్నించేవారు అల్పసంఖ్యాకులు వారు జైళ్లల్లో వుంటారు. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన అవినీతి పరులంతా కమలం కండువాలు కప్పుకుని బీజేపీలో లీనమైపోతారు. ఈ అవినీతిపరుల అఖండ బురదలో బీజేపీ పంకజం దేదీప్యమానంగా వికసిస్తుంది. అదే వికసిత భారతంగా భాసిస్తుంది. దరహం మీద మోదీ "అవినీతి వేట" కమలం కండువాలు కప్పడంతో సరిపుచ్చుకుంటుంది..

# రైతుల పోరాట ఫలితమే...

వడ్డే శోభనాద్రీశ్వరరావు

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడచినా, రైతు పరిస్థితి గొర్రెతోక బెత్తెడు చందంగానే వుంది. గత 35 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధర కేవలం 22 రెట్లు పెరగగా, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు 90 నుంచి 120 రెట్లు, సిమెంటు, కలప, మందులు, బట్టలు వంటి వస్తువుల ధరలు 70 నుంచి 100 రెట్లు పెరిగాయి. హైదరాబాద్‌లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ "ఎకూరా" అధ్యయనంలో 1996 నుంచి 2008 వరకు కేంద్రం వివిధ పంటలకు నిర్ణయించిన కనీస మద్దతు ధరలు సాగు ఖర్చు కన్నా 38శాతం తక్కువగా ఉన్నాయని తెలిపింది. నాబార్డు సర్వే ప్రకారం 2017లో, సగటు నెలసరి వ్యవసాయ కుటుంబ ఆదాయం రూ.893. ఇందులో 39.8శాతం కూలినాలి ద్వారా, 37.2శాతం పంటల ఉత్పత్తి, 15.5శాతం పశుపోషణ, పాడిపైన, ఇతరత్రా 6.3శాతం వస్తుందని తెలిపింది. ఇందులో నుంచి ఖర్చులు పోగా మిగిలేది ఎకరం లోపు భూమి గల వారికి నెలకు రూ.465, 1 నుంచి 2.5 ఎకరాల వారికి రూ.1,518, 2.5 నుంచి 5 ఎకరాల వారికి రూ.2,188, 5 ఎకరాల పైన వారికి రూ.4,895 మిగులు వుందని సర్వేలో తేలింది. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవటంతోపాటు కరువులు, తుపాన్లు, చీడ పీడలు, ధరల పతనం మున్నగు వాటి వలన రుణభారం పెరిగి, దాదాపు 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరిలో అత్యధికులు పత్తి పంట సాగుచేసిన సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, బలహీన వర్గాలకు చెందిన వారున్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించి, వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టెక్కించే వ్యూహాన్ని రూపొందించేందుకు ఏర్పాటైన డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ రైతు కమిషన్ దేశమంతటా పర్యటించి సమగ్ర నివేదికను 2006లో కేంద్రానికి సమర్పించింది. ఆ కమిషన్ ఏర్పాటు చేసిన మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం, నివేదికలోని కీలక సిఫార్సులను కొన్నింటిని ఆమోదించకుండా, ప్రాధాన్యతలేని కొన్ని అంశాలను ఆమోదించింది. 2014 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ తరపున ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీ తమ పార్టీ అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం పంటల ఉత్పత్తి వ్యయం (జ2) + 50శాతం ఎమ్మెస్పీ నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు. నగదుగా ఖర్చు చేసిన మొత్తానికి కుటుంబసభ్యుల శ్రమ విలువను కలిపి, 50శాతం కలిపి ఎమ్మెస్పీ ప్రకటించారు. ఈ ఎమ్మెస్పీ కూడా దేశంలో 10శాతం రైతులకు మాత్రమే లబ్ధి చేకూర్చుతూంది. ఫలితంగా 2014 తరువాత రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూ వచ్చాయి. 2022 నాటికి 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని జాతీయ నేర రికార్డు బ్యూరో ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి ప్రభావం, లాక్‌డౌన్ అమలులో ఉన్న కాలంలో మోదీ ప్రభుత్వం ఎలక్ట్రిసిటి ఆర్డినెన్స్‌ను, పార్లమెంట్‌లో మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టింది.. రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు అత్యంత కీలకమైన ఈ బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపి లోతుగా పరిశీలించడం అవసరమని సూచించినా, పట్టించుకోకపోగా ఓటింగ్ నిర్వహించాలని కోరినా తిరస్కరించి మూజువాణి ఓటుతో ఆమోదించడం అత్యంత దుర్మార్గం. ఈ మూడు చట్టాల వలన దేశంలో నిర్వహిస్తున్న 2384 రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు, 4887 సబ్ యార్డులు, ఏపీఎంసీలు నోటిఫై చేసిన ప్రైవేట్ మార్కెట్ యార్డులు, ఈనామ్‌తో అనుసంధానించిన 1000 మార్కెట్ యార్డులతో సహా మొత్తం అగ్రికల్చరల్ మార్కెటింగ్ వ్యవస్థ నిర్వీర్యమై కుప్పకూలుతుంది. రిలయన్స్ రిటైల్, వాల్‌మార్టు, అదాని ఫార్చ్యూన్, డి.మార్ట్, మోర్, మెట్రో మున్నగు కార్పొరేట్ రిటైల్ సంస్థలు ఒక్క పైసా మార్కెట్ సెస్ కట్టాల్సిన పనిలేకుండా, ఎంత కావాలి అనుకుంటే అంత సరుకును కొనుగోలు చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఉన్న మార్కెట్ వ్యవస్థకు వెలుపల "ట్రేడ్ ఏరియా పేరుతో" కార్పొరేట్ సంస్థల ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫామ్‌లకు ఎమ్మెస్పీలతో నిమిత్తం లేకుండా బీహార్‌లో వలే అతి తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవలసిన పరిస్థితి రైతులకు దాపురించింది. ఈ ప్రమాదాన్ని గ్రహించి మన దేశంలోని 450 రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా బ్యానర్ క్రింద ఈ మూడు నల్ల వ్యవసాయ చట్టాలరద్దుకు పోరాటం చేస్తూ వచ్చాయి. రైతులను దేశ రాజధాని ఢిల్లీ లోనికి రానీయకుండా కట్టడి చేసేందుకు మోదీ ప్రభుత్వం రోడ్లపైన మేకులు కొట్టి, బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులను వినియోగించి రైతుల పోరాటాన్ని భగ్నం చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేసింది. ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడినా రైతు సంఘాలు సమన్వయంతో 13 మాసాలపాటు సింఘు, టిక్రి, ఘజియాబాద్ వద్ద వేలమంది శాంతియుతంగా ఉద్యమాన్ని కొనసాగించారు. చిట్టచివరకు యూపీ ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం మూడు చట్టాలను పార్లమెంట్‌లో ఉపసంహరించింది. భారత రైతాంగానికి క్షమాపణలు చెప్పి రైతుల డిమాండ్లను పరిశీలించి సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినా, మోదీ ప్రభుత్వం అమలు చెయ్యలేదు. రైతాంగం చేస్తున్న డిమాండ్లలో హేతుబద్ధత వుందని, వారికి న్యాయం చేయవలసిన అవసరం వుందని భావించిన కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చాతో కలిసి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేసింది. ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తులు చేసినప్పటికీ మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవడమే కాక దేశంలో ఆహార కొరతను, అల్లకల్లోల పరిస్థితులను కల్పించాలనే దురుద్దేశంతో రైతు ఉద్యమం జరుగుతోందని, దానికి చైనా నుంచి న్యూస్ క్లిక్ ద్వారా నిధులు అందాయని తప్పుడు ఆరోపణలు, ప్రచారానికి ఒడిగట్టింది. నాగపూర్‌లో 15-17 మార్చి 20-24లో నిర్వహించిన అఖిల భారతీయ ప్రతినిధుల సభలో రైతుల ఉద్యమం వెనుక ఖలిస్తానీ ఉగ్రవాదులు ఉన్నారని, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే ఉద్దేశంతో రైతు ఉద్యమం జరుగుతోందని ఆరోపించడం రైతాంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తేటతెల్లం చేస్తోంది. సుదీర్ఘకాలంగా రైతు సంఘాలు ఐక్యంగా పోరాటం కొనసాగించిన పర్యవసానంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే పంటల సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి (జ2+50శాతం) చట్టబద్ధత ఎమ్మెస్పీ. నిర్ణయిస్తామని హామీ ఇవ్వడము శుభపరిణామం. రైతులకు రూ.2,00,000 వరకు రుణ మాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ తమ ఎన్నికల ప్రణాళికలో తెలియచేసింది. రైతులకు రుణమాఫీ ప్రకటించమని 2018 నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోని మోదీ కార్పొరేట్ సంస్థలకు రూ.14.60 లక్షల కోట్లు మాఫీ చేశారు. జనతా ప్రభుత్వంలో దేవిలాల్ ఉప ప్రధానిగా ఉండగా రూ.10 వేల కోట్లు వ్యయంతో రైతుకు 10వేల రూపాయలు వరకు వ్యవసాయ రుణమాఫీ చేశారు. 2007-08లో మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం రూ.52,500 కోట్లు రైతుల రుణాలను మాఫీ చేసినది. 2014-2015 నుంచి 2019-2020 వరకు పది రాష్ట్రాల్లో రూ.1.48 లక్షల కోట్లు పంట రుణాలు మాఫీ అయ్యాయి. కోట్లాదిమంది రైతు కుటుంబాలు కట్టవలసిన సుమారు రూ.1.5 లక్షల కోట్ల రైతు రుణాల బకాయి రుణాలను రద్దుచేయడానికి అంగీకరించని మోదీ కార్పొరేట్ సంస్థలకు లక్షలాది కోట్ల రుణాలను మాఫీ చేయడం అత్యంత దుర్మార్గం. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం చేకూరినప్పుడు 30 రోజులలో ఇన్‌పుట్ సబ్సిడి రైతుల ఖాతాల్లోకి జమఅవుతుంది. ముఖ్యంగా చిన్నకారు, సన్నకారు, కౌలు రైతులకు చాలా సహాయపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వలన మనదేశంలో కూడా పంటలకు నష్టం వాటిల్లవచ్చన్న అంచనాల నేపథ్యంలో ఇది చాలా ఉపయోగం. రైతుల ప్రయోజనాలు దృష్ట్యా "ఎగుమతులు- దిగుమ తులు" విధానం సవరించనున్న గ్యారంటీ కూడా వ్యవసాయరంగ ప్రగతికి దోహదం చేస్తుంది. స్వామినాథన్ కమిషన్ ప్రధాన సిఫార్సు జ2+ 50శాతాన్ని అప్పుడు ఆమోదించకపోయి నప్పటికి, ఇప్పుడు భారత రైతాంగ ప్రధానమైన డిమాండ్లను అర్థం చేసుకుని వాటిని ఆమోదించి, తప్పనిసరిగా అమలు చేసేందుకు ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ పెట్టడం శుభపరిణామం. వ్యవసాయ రంగం మరింత అభివృద్ధిచెందేందుకు, రైతులతోపాటు వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులలో కూడా గణనీయమైన ప్రగతి సాధన చేకూరుతుంది. కావున కేంద్రస్థాయిలో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించి ఇండియా కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

# మానవ బలహీనతకు చిహ్నమే దేవుడు

డాక్టర్ దేవరాజు మహారాజు

'దైవ సిద్ధాంతాన్ని వదిలి నైతిక విలువల్ని స్థాపించాలి!' - మహా శాస్త్రవేత్త - ఐన్ స్టీన్.

న్యూయార్క్ మహా నగరంలో సండే స్కూల్ లో ఆరో తరగతి చదివే తన ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో ఐన్ స్టీన్‌కు ఒక ఉత్తరం రాశాడు. అందులో ఒక ప్రశ్న ఉంది. "శాస్త్రవేత్తలు ప్రార్థన చేస్తారా ? చేస్తే దేని కోసం చేస్తారూ?" అని! దానికి ఐన్ స్టీన్ ఇలా సమాధాన మిచ్చాడు. " ప్రకృతి సూత్రాల కనుగుణంగా ప్రతిదీ జరుగుతూ ఉందన్న భావన మీద శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయి. అందువల్ల ప్రార్థన తోనో, అతీంద్రియ శక్తు లతోనో, ఆరాధనతోనో సహజ పరిణామాల్ని ప్రభావితం చేయవచ్చని ఏ పరిశోధకుడూ నమ్మడు " అని ఐన్‌స్టీన్ వివరణ ఇచ్చాడు. మానవుడి సనాతన ఆలోచనా విధానాన్ని పునాదులతో పెకిలించి, శాస్త్రీయంగా, హేతుబద్ధంగా నూతన ఒరవడిలో సరికొత్త ఆలోచనా ధారను ప్రపంచ మానవాళికి అంద జేసిన ప్రఖ్యాత శాస్త్రవేత్తల్ని, సామాజిక తత్త్వవేత్తల్ని వేళ్ళ మీద లెక్కబెట్టొచ్చు. చార్లెస్ డార్విన్ తన (జీవ పరిణామ సిద్ధాంతంతో సృష్టి రహస్యాన్ని ఛేదించాడు. కార్ల్ మార్క్స్ 'పెట్టుబడి' లో అదనపు విలువకున్న ప్రాముఖ్యతను ఆవిష్కరించి పెట్టుబడిదారీ వ్యవస్థను తూర్పారబట్టాడు. సిగ్మండ్ ఫ్రాయిడ్ ' మనో విశ్లేషణ' ఫలకంపై కొత్త ఆలోచనల్ని రూపుకట్టి సరికొత్త చర్చలకు తెరలేపాడు. ఆ కోవకు చెందిన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త 'ఐన్ స్టీన్ భౌతిక శాస్త్రంలో సాపేక్ష సిద్ధాంతంతో' సంచలనం సృష్టించాడు. ఐన్‌స్టీన్ దృష్టిలో దేవుడంటే ప్రకృతి, ప్రకృతి ధర్మాలు మాత్రమే! ఆయన అతీంద్రియ శక్తుల్ని గానీ, క్రైస్తవ మతంలోని ట్రినిటీని గానీ, ఏసుక్రీస్తు మహిమల్ని గానీ, ఆత్మ అమరత్వాన్నిగానీ, గ్రహబలం గురించి గానీ ఎప్పుడూ నమ్మలేదు. " దేవుడు ఈ విశ్వంతో ఎప్పుడూ ఆటలాడుకోడు" అని ఐన్ స్టీన్ తరచుగా అంటుండేవాడు. విశ్వంలో యాదృచ్ఛికమైన గతులుండవు. గణిత సూత్రాలకు అనుగుణంగానే ప్రకృతి నడుస్తూ ఉంది - అని ఖచ్చితమైన అభిప్రాయం ఉన్నవాడాయన. ఆయన 'మతం' అనే మాటకు మరొక అర్థం చెప్పాడు. దేవుడితో సంబంధంలేకుండా మనిషి నైతికతతో మెలిగి, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే- మతం అన్నాడు. ఆ అర్థంతోనే మతం అభిమతం మానవాళికి అవసరమన్నాడు. అయితే ఈ అంశాన్ని ఆయన చెప్పిన స్థాయిలోకి వెళ్ళి ఆలోచించాల్సి ఉంటుంది. అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మతం, దేవుడు అనే మూఢత్వంలో కొట్టుకుపోయే జనానికి ఈ విషయం అర్థం కావడం కష్టమే! అయితే అర్థం కానంత క్లిష్టమైంది కూడా కాదు. వంశపారం పర్యంగా జీర్ణించుకుంటూ వచ్చిన సనాతన భావజాలాన్ని కొంచెం పక్కన పెట్టి, మెదడులో ఏ మూలో దాక్కుని ఉన్న హేతువును నిద్ర లేపి విశాల హృదయంతో కొంచెం కొత్తగా ఆలోచిస్తే చాలు. ఐన్ స్టీన్ భావం మనకు అందుబాటులో కొస్తుంది.



"మన ఈ మెటీరియలిస్టిక్ యుగంలో మానవాళి శ్రేయస్సుకోసం నిరంతరం శ్రమిస్తున్న, తపన పడుతున్న శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైజ్ఞానిక రచయితలే అత్యంత విశ్వసనీయమైన మతస్తులు" అని అన్నారాయన. మళ్ళీ ఈ అంశాన్ని కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వాడుకలో ఉన్నట్లుగా 'మతస్తులు' అనే పదాన్ని 'ఒక మతాన్ని నమ్మేవారు' అని అర్థం చేసుకోకూడదు. ఒక మహా శాస్త్రవేత్త ఉద్దేశాన్ని స్థాయిని కొంతైనా అర్థం చేసుకోవాలని వైజ్ఞానిక స్పృహతో ప్రయ త్నించే వారికి, తహతహ లాడేవారికి తప్పక అర్థమౌతుంది. మౌఢ్యం గుంజకు తమని తాము కట్టేసుకున్నవారికి అర్థం కాకపోవచ్చు. బంధనాల్ని తెంచుకుని స్వేచ్ఛగా ముందుకొస్తే అర్థమవుతుంది. వ్యక్తులు ఊహించుకున్న 'దేవుణ్ణి' ఐన్‌స్టీన్ ఏనాడూ నమ్మలేదు. ఆ విషయాన్ని ఆయన చాలా సందర్భాల్లో విస్పష్టంగా చెప్పారు కూడా! "తను సృష్టించిన వాటిని తానే ఆదుకోలేక, మళ్ళీ తనే శిక్షించే దేవుణ్ణి నేను ఊహించుకోలేను. హేతువుకు, భౌతిక శాస్త్ర సూత్రాలకూ వ్యతిరేకంగా ఆయన చూపే అలల్ని కూడా నేను ఊహించుకోలేను. అసలు దేవుడంటే ఎవరు? మనిషి బలహీనతకు ప్రతిబింబం! మనిషి భయంలోంచి, అజ్ఞానంలోంచి, ఊహల్లోంచి, భ్రమ లోంచి రూపు దిద్దుకున్న భగవంతుడు చూపిన లీలలకు, లేదా చూపాడని చెప్పుకుంటున్న మహిమలకు ఆధారాలే లేవు. అలాంటప్పుడు మనం వాటిని నమ్మేదెట్లా ?- అన్నది ఐన్ స్టీన్ సంధించిన ప్రశ్న ! దేవుడనే ఊహ- మానవ ప్రాథమిక శాస్త్రాల (రచనల) కల్పన. దాన్ని ఆయన ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. మానవాతీత శక్తిగా కూడా పరిగణించలేదు. అసంపూర్ణంగానైనా, వినయంగా నమ్రతతో గ్రహించే ఈ విశ్వం యొక్క క్రమబద్ధత, దాని సామరస్యంలోని అందం మానవాళిని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఆ ఆశ్చర్యాన్ని ఆనందించాలి. ఆస్వాదించాలి. అనుభవించాలి. ఐన్‌స్టీన్ అదే చేశాడు. అదే చేయమన్నాడు. అంతే కాని మరొకటి కాదు. మతానికీ, శాస్త్రానికి మధ్య జరుగుతున్న ఘర్షణకు మూల కారణం వ్యక్తిగత దైవ విశ్వాసం. వైజ్ఞానిక శాస్త్రాలకు రుజువులున్నాయి. దైవ విశ్వాసానికి ఉండవు. రుజువులున్నా దానితో రుజువులు లేనిది ఘర్ష ణ పడుతోంది. రుజువులు లేని దైవ విశ్వాసం అనేది లేకపోతే మానవులంతా వైజ్ఞానిక ప్రగతిని విశ్వసిస్తారు.. అప్పుడు ఘర్షణ ఉండడానికి వీలుండదు. ఇప్పుడు సమాజం ఎలా ఉంది? వైజ్ఞానిక ప్రగతి ఫలితాలను అనుభవిస్తూ, దైవ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు కదా? వైజ్ఞానిక ఫలితాలు అనుభవించకుండా దైవ విశ్వాసంలో బతకగలిగితే బతకాలి. అప్పుడు కూడా ఘర్షణ ఉండదు. బాబాలు, స్వాములు, మాతాజీలు వగైరా సామాన్యుడి కన్నా ఎక్కువ వైజ్ఞానిక ఫలితాలు అనుభవిస్తున్నారు. మరోవైపు మూఢత్వం పెంచిపోషిస్తున్నారు. నైతికతను మరచి, అత్యంత హీనంగా ప్రవర్తిస్తున్నారు. శ్వాసక్రియ - కూడా జీవశాస్త్రంలో భాగం. ఆధ్యాత్మిక, ధార్మిక, తాత్త్విక ధోరణులలో ఎటునుంచి ఎటుతిప్పి చెప్పినా దైవ భావన - ఉట్టి విశ్వాసమే! ఉట్టి విశ్వాసంతో సంతోనోత్పత్తి జరగదు. ఆహారోత్పత్తి జరగదు. సమాజం పెరగదు . ఎదగదు. విశ్వ రహస్యాల్ని, జీవ రహస్యాల్ని మనిషి అర్థం చేసుకుంటూ ఒక్కొక్కటి ఆవిష్కరించుకుంటూ వస్తున్నాడు గనకనే, మనం ఈ అత్యాధునిక సాంకేతిక యుగంలో ఉన్నాం. మునుల వల్లనో, రుషుల వల్లనో, ధార్మిక ఆధ్యాత్మిక గురువుల వల్లనో ప్రపంచం పురోగతి సాధించలేదు. అలాగే మత విశ్వాసాల వల్ల ఘర్షణలు జరిగాయే గానీ, శాంతి స్థాపన జరగ లేదు. "ఏవరో నమ్ముకున్న దేవుడు లేడని నేనెందుకు నిరూపించాలి? అది నా పని కాదు. నమ్ముతున్న వారే, వారెందుకు నమ్ముతున్నారో నిరూపించుకోవాలి. దేవుడున్నాడని మాట్లాడితే నేనొక అబద్ధాల కోరునవుతాను. అయినా, వాస్తవాలకు నిరూపణలు వెతకొచ్చు. అవాస్తవాలకు నిరూపణ లెక్కడ?"- అని ప్రశ్నించిన ఐన్‌స్టీన్ మత ప్రచారకులకు కొన్ని సూచనలిచ్చాడు - మత ప్రచారకులంతా తమ వ్యక్తిగత దేవుడి సిద్ధాంతాన్ని వదిలేయాలి, తమ ఆధీనంలో ఉన్న పాప పుణ్యాల్ని, భయాల్ని, నిరాశావాదాన్ని, పునర్జన్మల్ని మొత్తానికి మొత్తంగా తుడి చేసుకోవాలి. నైతిక విలువల్ని కాపాడే పోరాటంలో సామాన్యులతో కలిసి రావాలి. 'కార్యకారణ సూత్రం' పై పనిచేసే ఈ విశాల విశ్వాన్ని అర్థం చేసుకోవాలి. జరిగిన జరుగుతున్న పరిణామాల మీద అవగాహన పెంచుకోవాలి. మతంపై నుండి దృష్టి మరల్చి, సామాజిక అసమానతల పై దృష్టి పెట్టాలి - అని ! అన్నారు. మానవుడి అమరత్వం పై తనకు నమ్మకం లేదని, నీతి అనేది మానవాతీత శక్తి కాదని, మానవుడికి సంబంధించిందే నని.. అది అతడు తన ఆత్మ విశ్వాసంతో సాధించుకోవచ్చని. ఈ విషయంలో దేవుడి ప్రమేయమేలేదని కరాఖండిగా చెప్పిన ఈ శాస్త్రవేత్త, మరణానంతర జీవితాన్ని కొట్టి పారేశాడు. మనిషి అంతర్గత అనుభవాలన్నీ పునరుత్పత్తులతో, సునిశిత భావ సముచ్చయంతో ముడివడి ఉంటాయి తప్పితే, దేహమే లేకపోయినప్పుడు ఆత్మకు అర్థమే లేదు.. లేని అత్మల్ని జనం గుండెల్లో పదిల పర్చుతుంటారు. మతం గురించిన ప్రస్తావనలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక చోట ఇలా రాసుకున్నాడు. మతపరమైన తీవ్ర ఒత్తిళ్ళను ఆయన బాల్యంలోనే ఎలా అనుభవించాడో గుర్తు చేసుకున్నాడు- "నాకు పన్నెండో యేటి నుండి పాఠశాల మీద, ఉపాధ్యాయుల మీద అపనమ్మకం ప్రారంభమైంది. స్కూలు నన్ను ఫెయిల్ చేసింది. నేను స్కూలును ! ఉపాధ్యాయు లెప్పుడూ మిలట్రీ సార్జంట్ల లాగ ప్రవర్తించేవారు. నాకు కావల్సింది నన్ను నేర్చుకోనిచ్చేవారు కాదు. ఆ పోటీ తత్వం నాకు నచ్చేది కాదు.. మ్యూనిచ్‌లో అది ఒక క్యాథలిక్ స్కూలు. ఇక చెప్పేదేముంది? నా జ్ఞాన తృష్ణను మెలికవేసి తిప్పుతూ, తిప్పుతూ ఉండేవారు- ప్రెయిజ్ ద గాడ్ ! పైగా మార్కులు, గ్రేడ్‌లే వారి కొలబద్దలు. అలాంటి వ్యవస్థతో ఉపాధ్యాయులు పసికూనలైన చిన్నారుల మనోభావాల్ని, ఉత్సాహాల్ని, అభిరుచుల్ని ఎలా బేరీజు వేయగలరో నాకు తెలిసేది కాదు. "ఐన్‌స్టీన్ బాల్య అనుభవాలకు, సమకాలీనంలో మన బాల బాలికల జీవితానికి పెద్దగా తేడా లేదు. మిషనరీ స్కూలయితే ప్రేయర్. మదరసా అయితే అల్లా, వేదపాఠశాల అయితే వేదాలు. అంతే. మత ప్రమేయం లేకుండా విచక్షణా జ్ఞానాన్ని పెంచే చదువులున్నాయా? వాస్తవాలేవో, భ్రమలేవో, కల్పన లేవో పిల్లలకు విడమరిచి చెపుతున్నామా? మతం సాధించే విజయానికి, విద్యావ్యవస్థ అపజయానికి నేరుగా అవినాభావ సంబంధం ఉంది. సరే, గతం గడిచిపోయింది. ఏం చేసినా దాన్నిక మార్చలేం కానీ, సుఖాంతమయ్యే ఒక కొత్త ప్రారంభానికి మనం బీజం వెయ్యొచ్చుకదా?

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త

# ఇప్పుడు ఎక్కువ సీట్లే సాధిస్తాం: చిదంబరం

**కోల్‌కతా:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 2019తో పోల్చితే అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం జోస్యం చెప్పారు. కోల్‌కతాలో ఆయన మాట్లాడుతూ '2019 కంటే వచ్చే ఎన్నికల్లో మా పార్టీ ఎక్కువ సీట్లు సాధిస్తుంది. తమిళనాడు, కేరళలో ఇండియా కూటమి తిరుగులేని విజయాన్ని నమోదు చేస్తుంది. దేశంలో హిందూ మతానికి, హిందువులకు ఎలాంటి ముప్పు లేదు. ప్రధాని మోదీ హిందుత్వను రక్షిస్తున్నట్లుగా చూపడానికి... ప్రతిపక్షాలను హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నారు. ఇది బీజేపీ అవలంబిస్తున్న ఓ వ్యూహం. ఈ ఎన్నికల్లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బీజేపీని ఢీ కొట్టబోతున్నారు. రాష్ట్రంలో మమత మరోసారి పట్టునిలుపుకొని ఇండియా కూటమిని బలోపేతం చేస్తారు. కేరళలో రెండు ఫ్రంట్‌లు (యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్) 20 సీట్లను గెలుచుకుంటాయి. అక్కడ బీజేపీకి ఒక్క సీటూ రాదు. కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాదరణ పొందాయి. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు చాలా ఎక్కువ సీట్లు వస్తాయి. చివరిసారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 52 సీట్లు గెలుచుకుంది. ఈసారి మేం గెలుచుకోబోయే స్థానాలపై మాకు ఒక అంచనా ఉంది. హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఢిల్లీలలో ఇండియా కూటమి గణనీయమైన సీట్లలో విజయఢంకా మోగిస్తుంది' అని చిదంబరం చెప్పారు. 'ప్రతిపక్షాలవి బుజ్జగింపు, వారసత్వ రాజకీయాలని చెప్పడం బీజేపీ వ్యూహంలో భాగం. వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరు. కచ్చతీవు సమస్య ముగిసిపోయింది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బీజేపీ ఈ అంశాన్ని లేవనెత్తడం ఏంటి? 50 ఏళ్ల క్రితం ఒప్పందం కుదిరింది. 2014 నుంచి మోదీ అధికారంలో ఉన్నారు. గత 10 ఏళ్లుగా ఆ అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదు' అని చిదంబరం ప్రశ్నించారు.

# మహారాష్ట్రలో కలహాభోజనం

- కొత్త మిత్రులు, పాత శత్రువులు
- సార్వత్రిక ఎన్నికల వేళ హోరాహోరీ పోరు

**ముంబై :** 2024 లోక్‌సభ ఎన్నికలు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణలు సుడులు తిరుగుతున్నాయి. గతంలోని మిత్రులు ఇప్పుడు శత్రువులయ్యారు. ఇక ఇప్పుడు శత్రువులే మిత్రులయ్యారు. పార్టీలు పొత్తులను తెంచుకొని, కొత్త కూటమిలను ఏర్పాటు చేశాయి. గురువారం రాష్ట్రంలోని నాందేడ్‌లో జరిగిన అమిత్ షా ర్యాలీనే ఇందుకు నిదర్శనం. మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, బీజేపీ అభ్యర్థి ప్రతాప్ పాటిల్ చిఖాలీకర్ ఒక వేదికను పంచుకున్నారు. లాతూర్ జిల్లాలోని లోహా నుంచి ఉమ్మడి శివసేన ఎమ్మెల్యేగా ఉన్న చిఖాలికర్ 2019లో బీజేపీలో చేరారు. తరువాతి లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ కంచుకోట అయిన నాందేడ్ నుంచి కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ అశోక్ చవాన్‌ను ఓడించారు. ప్రధాని నరేంద్ర మోదీ అప్పుడు ప్రచార ర్యాలీలో ఆదర్శ్ సొసైటీ కుంభకోణంపై చవాన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్... చవాన్ 'ఒక డీలర్, ఒక నాయకుడు కాదు' అని విమర్శించారు. ఇదిలాఉండగా, చవాన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బీజేపీలో చేరి, రాజ్యసభ సభ్యుడిగా మారారు. ఆయన ఇప్పుడు చిఖాలికర్ కోసం, అలాగే మరఠ్వాడా ప్రాంతంలోని బీజేపీ అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తున్నారు. 2019లో మావల్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్‌సీపీ నాయకుడు అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌ను శివసేనకు చెందిన శ్రీరంగ్ బర్నే ఓడించారు. శరద్ పవార్ పెద్ద కుటుంబానికి చెందిన సభ్యుడు ఎన్నికల ఓటమిని రుచి చూడడం ఇదే మొదటిసారి. తన బాబాయి శరద్ పవార్‌తో విడిపోయిన అజిత్ పవార్ గత ఏడాది బీజేపీతో చేతులు కలిపారు. అజిత్ పవార్ ఈ ఎన్నికల్లో బర్నే కోసం ప్రచారం చేస్తున్నారు. 2019లో శిరూర్ లోక్‌సభ నియోజకవర్గంలో శివసేన సిట్టింగ్ ఎంపీ శివాజీరావు అఢల్‌రావు-పాటిల్‌పై పోటీ చేసేందుకు ఉమ్మడి శివసేనలో ఉన్న ప్రముఖ టీవీ, సినీ నటుడు అమోల్ కోల్హేను అజిత్ పవార్ ఒప్పించారని చెబుతున్నారు. కోల్హే అఢల్‌రావు-పాటిల్‌ను ఓడించాడు. కోల్హే ఇప్పుడు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ) లో ఉన్నారు. అధికార బీజేపీ-శివసేన-ఎన్‌సీపీ 'మహాయుతి' కూటమి సీట్ల పంపిణీ ఒప్పందంలో షిరూర్ సీటు అజిత్ పవార్‌కు దక్కగా, కోల్హేను ఓడించాలనే ఉద్దేశంతో అఢల్‌రావు పాటిల్‌ను ఎన్‌సీపీలోకి చేర్చుకున్నారు. ఇప్పుడు అజిత్ పవార్ తన మాజీ అనుచరుడు కోల్హేకు వ్యతిరేకంగా ప్రచారం చేయనున్నారు. ముంబై సౌత్-సెంట్రల్ నియోజకవర్గంలో ఉమ్మడి శివసేనకు చెందిన రాహుల్ షెవాలే, శివసేన (యూబీటీ) కి చెందిన అనిల్ దేశాయ్‌పై రెండుసార్లు పోటీ పడ్డారు. 2022లో పార్టీ చీలిపోయినప్పుడు షెవాలే షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ఇక ఉద్ధవ్ ఠాక్రేకు సన్నిహితుడైన దేశాయ్ తన రాజ్యసభ పదవీ కాలం ముగిసిన తర్వాత తన మాజీ సహచరుడు షెవాల్‌పై ఎన్నికల కదన రంగంలోకి దిగారు. మరొక ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, దేశాయ్ కొత్త మద్దతు కూడగట్టుకున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో షెవాలే చేతిలో ఓటమి పాలైన దివంగత ఏక్‌నాథ్ గైక్వాడ్ కుమారుడు, కాంగ్రెస్ పార్టీ ముంబై అధ్యక్షుడు వర్ష గైక్వాడ్ నుంచి మద్దతు అందుకుంటున్నారు.

**బారామతిలో కుటుంబ పోరు**

బారామతిలో రాజకీయ కుటుంబ పోరు ఆసక్తికరంగా మారింది. ఇక్కడ పవార్ కుటుంబానికి చెందిన ఇద్దరు పరస్పరం పోటీకి దిగారు. గతంలో అజిత్ పవార్... సుప్రియా సూలేను ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. ఇప్పుడు మాత్రం మూడు సార్లు ఎంపీగా పని చేసిన సుప్రియా సూలేపై తన భార్య సునేత్ర పవార్‌ను పోటీకి దించడం ద్వారా కొత్త రాజకీయాలకు తెరదీశారు. ఆయన తమ్ముడు శ్రీనివాస్, ఆయన కుటుంబం సూలేకి మద్దతుగా రావడంతో అజిత్ సమీప కుటుంబంలో కూడా ఈ యుద్ధం చీలికలకు కారణమైంది. బీడ్‌లో బీజేపీ సిట్టింగ్ ఎంపీ ప్రీతమ్ ముండే స్థానంలో ఆమె అక్క, రాష్ట్ర మాజీ మంత్రి పంకజా ముండేను అభ్యర్థిగా ఎంపిక చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికలలో పంకజ తన బంధువు, ఎన్‌సీపీ నాయకుడు ధనంజయ్ ముండే చేతిలో ఓడిపోయారు. ధనంజయ్ ముండే ఇప్పుడు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీలో ఉన్నారు. ఆయన అధికార కూటమి అభ్యర్థి పంకజా కోసం ప్రచారం చేయనున్నారు. అలాగే తీరప్రాంత రాయఘడ్‌లో 2019లో ఎన్‌సీపీకి చెందిన సునీల్ తట్కరే దీర్ఘకాల శివసేన ఎంపీ అనంత్ గీతేను స్వల్ప తేడాతో ఓడించారు. శరద్ పవార్ పార్టీతో పొత్తులో ఉన్నందున కాంగ్రెస్ తత్కరేకు మద్దతు ఇచ్చింది. ఇప్పుడు తత్కరే అజిత్ పవార్‌కు చెందిన ఎన్‌సీపీలో ఉన్నారు. అయితే గీతే శివసేన విభజన తర్వాత ఉద్ధవ్ ఠాక్రే వర్గంతో ఉన్నారు. గీతే పక్కన కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్చంద్ర పవార్) ఉన్నారు. 'దేవేంద్ర ఫడ్నవీస్ శివసేన, ఎన్‌సీపీలో చీలికలకు ముందు రెండూ కుటుంబ పార్టీలే. ప్రస్తుత ఎన్నికలు మహాభారత యుద్ధంగా మారాయని సీనియర్ జర్నలిస్టు, రాజకీయ వ్యాఖ్యాత ప్రకాశ్ అకోల్కర్ పీటీఐతో అన్నారు. 'కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు పోరాడుతున్నప్పుడు వారు పాత శత్రువులకు కూడా సహాయం చేస్తున్నారు' అని చెప్పారు.

# అబ్దుల్ రహీమ్ కోసం కదిలిరండి

## కేరళ సీఎం విజయన్

**తిరువనంతపురం:** కేరళకు చెందిన అబ్దుల్ రహీమ్ కోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ రంగంలోకి దిగారు. అతడిని మరణశిక్ష నుంచి రక్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అబ్దుల్ రహీమ్‌ను రక్షించేందుకు నేను సైతం అంటూ ప్రపంచంలోని మలయాళీలంతా కదిలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. వివరాల్లోకి వెళితే...కేరళలోని కోజికోడ్ నివాసి అబ్దుల్ రహీమ్. అతడు సౌదీ అరేబియాలో నివసిస్తున్నాడు. కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూనే 15 ఏళ్ల దివ్యాంగుడికి కేర్ కేటర్‌గా ఉంటున్నాడు. అయితే ఓ రోజు ఆ దివ్యాంగుడిని కారులో తీసుకువెళ్తున్నాడు. రహదారిపై రెడ్ సిగ్నల్ పడడంతో కారు ఆపాడు. సిగ్నల్‌ను అతిక్రమించమని ఆ దివ్యాంగుడు కోరాడు. అందుకు అగ్రహించి ఆ బాబుపై చెయ్యి చేసుకున్నాడు. ఇంతలో అతడికి ప్రాణవాయువు అందించే పైప్ ఊడిపోయింది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాలు అబ్దుల్ రహీమ్ పోలీసులకు వెల్లడించాడు. దీంతో సౌదీ చట్టం ప్రకారం 2018లో అబ్దుల్ రహీమ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. అయితే అతడి మరణశిక్షపై ఆ దివ్యాంగుడి కుటుంబం తీవ్ర మొండివైఖరితో ఉంది. చివరకు రూ.15 మిలియన్ సౌదీ రియాల్స్ (భారతీయ కరెన్సీ ప్రకారం రూ.34 కోట్లు) చెల్లిస్తే క్షమాపణలు చెప్పేందుకు ఆ కుటుంబం అంగీకరించింది. ఆ క్రమంలో అబ్దుల్ రహీమ్‌ను రక్షించేందుకు లీగల్ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సేవ్ అబ్దుల్ రహీమ్ పేరిట ఓ యాప్‌ను సృష్టించారు. దీనిద్వారా ఇప్పటికి రూ.30 కోట్లకు పైగా నగదు సేకరించారు. మరోవైపు సోషల్ మీడియాలో సైతం ప్రచారాన్ని ఉధృతం చేశారు. దీంతో మరణం అంచునున్న అబ్దుల్ రహీమ్‌ను రక్షించనున్నారు. అయితే ఏప్రిల్ 15 లోపు ఆ నగదు మొత్తం చెల్లించాల్సి ఉంది. అందుకు సమయం సమీపిస్తున్నది. దాంతో అబ్దుల్ రహీమ్‌ను రక్షించేందుకు లీగల్ కమిటీ రియాద్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదిస్తోంది.

# సీఎం స్టాలిన్‌కు రాహుల్ 'స్వీట్' కానుక

**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌కు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓ స్వీటు కానుకగా అందించారు. ఆ కానుకను అందుకున్న సీఎం స్టాలిన్... రాహుల్ అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. కొయంబత్తూరులో స్టాలిన్‌తో కలిసి రాహుల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సభ అనంతరం నిన్న రాత్రి సింగనల్లూరులోని ఓ మిఠాయి దుకాణానికి రాహుల్ వెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ తమ సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది. అందులో కాంగ్రెస్ నేత రోడ్డు మధ్యలోని డివైడర్‌ను దాటి దుకాణానికి వెళ్లారు. రాహుల్‌ను చూసి షాపు సిబ్బంది ఆశ్చర్యానికి లోనయ్యారు. ఏం కావాలి సా అని అడగ్గా.. 'మా బ్రదర్ స్టాలిన్ కోసం మైసూర్ పాక్ కొనాలి' అని చెప్పడం వీడియోలో ఉంది. షాప్‌లోని మిఠాయిలను రాహుల్ రుచిచూశారు. అనంతరం ఆ స్వీట్లు తీసుకుని స్టాలిన్ ఇంటికి వెళ్లి సీఎంకు అందించారు. ఈ వీడియోకు స్టాలిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. 'నా సోదరుడు రాహుల్ గాంధీ స్వీట్ కానుకతో నా హృదయం నిండిపోయింది. జూన్ 4న (ఎన్నికల ఫలితాలు వెలువడే తేదీ) ఇండియా కూటమి కూడా తప్పకుండా ఇలాంటి తీపి విజయాన్నే అందుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు.

# కారణం లేనిదే తీర్పు రద్దు వద్దు

## సుప్రీం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** 1996 సెప్టెంబరులో గుజరాత్‌లో తండ్రీకొడుకులు ఒక వ్యక్తిని హత్య చేశారనే కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం భిన్నాభిప్రాయానికి అవకాశం ఉందనే కారణంతో ట్రయల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన తీర్పును అప్పీలు న్యాయస్థానం కొట్టివేయడాన్ని తప్పుపట్టింది. సహేతుక కారణం లేనిదే నేర విముక్త తీర్పును రద్దు చేయరాదని శనివారం స్పష్టం చేసింది. దిగువ కోర్టు వెలువరించిన తీర్పులో ఏమైనా లోపాలుంటే స్పష్టంగా నమోదు చేయాలని, నమోదిత సాక్ష్యాలు వాస్తవమో కావో మరోసారి పరిశీలించి నిర్ధారించుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓక్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. అయితే నమోదిత సాక్ష్యాల ఆధారంగానే దిగువ కోర్టు తుది నిర్ణయానికి వచ్చిందా అనేది కూడా పరిశీలించాల్సి ఉంటుందని తీర్పు రాసిన జస్టిస్ అభయ్ ఓక్ వ్యాఖ్యానించారు. హైకోర్టు ఉత్తర్వుల్లో ఈ ప్రశ్నకు సమాధానం లేదనే విషయాన్ని ధర్మాసనం గుర్తించింది. అలాగే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యతను కూడా నిందితుడిపై అప్పీలు కోర్టు మోపడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. కేసు వివరాల్లోకి వెళితే... 1996 సెప్టెంబరులో గుజరాత్‌లో తండ్రీకొడుకులు ఒక వ్యక్తిని హత్య చేశారని సంబంధిత సంబంధిత పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితులను ట్రయల్ కోర్టులో హాజరుపరిచారు. అయితే నిందితులు నేరం చేశారని నిరూపించేందుకు సరైన ఆధారాలు లేవంటూ 1997 జులైలో నిందితులను విడుదల చేయాలంటూ ట్రయల్ కోర్టు ఆదేశించింది. దీనిని హైకోర్టులో సవాల్ చేయగా నిందితుల విడుదలకు ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును 2018లో రద్దు చేసింది. ఇక హైకోర్టు నిర్ణయంపై నిందితులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా తాజాగా తీర్పు వెలువడింది. ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది.

# అదే భాషలో ఉగ్రవాదులకు సమాధానం

## కేంద్రమంత్రి జైశంకర్

**పుణె:** సరిహద్దు ఉగ్రవాదాన్ని మట్టుపెట్టేందుకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఉగ్రవాదులకు ఎలాంటి నిబంధనలు ఉండవని, వారికి వారి భాషలోనే సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. ముంబైలోని పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ గత పదేళ్లలో దేశ విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రస్తావిస్తూ సరిహద్దులకు ఆవల ఉన్నామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని ముష్కరులు అనుకుంటే అందుకు దీటుగా మనం జవాబు చెప్పాల్సి ఉంటుందన్నారు. ఉగ్రవాదులు ఎవరూ రూల్స్ పెట్టుకుని దాడులు చేయరని, అలాంటప్పుడు ప్రతిచర్యలు కూడా ఎలాంటి నియమాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. నరేంద్ర మోదీ 2014లో ప్రధానమంత్రిగా వచ్చారని, కానీ సమస్య 2014లో మొదలు కాలేదని, 1947లోనే మొదలైందని జైశంకర్ చెప్పారు. అప్పుడే కశ్మీర్‌లోకి అడుగుపెట్టిన పాక్ ఉగ్రవాదులు కశ్మీరీలపై దాడులు చేశారన్నారు. 26/11 ముంబై ఉగ్రదాలను ప్రస్తావిస్తూ యూపీఏ ప్రభుత్వం అప్పట్లో అనేక దఫాలు చర్చలు జరిపిందని, అయితే పాకిస్థాన్‌పై దాడి చేయడం కంటే మిన్నకుండటం వల్లే ఎక్కువ మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. ముంబై దాడుల వంటి ఘటనలు జరిగినప్పుడు...దానిపై స్పందించనప్పుడు...ఆ తర్వాత జరిగే దాడులను ఎలా నిరోధించగలమని ఆయన ప్రశ్నించారు.

# బీహార్‌కు ప్రత్యేక హోదా

## యువతకు కోటి ఉద్యోగాలు

## ఆర్‌జేడీ మేనిఫెస్టో విడుదల

**పాట్నా:** 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలతో 'పరివర్తన్ పత్ర' పేరుతో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) ఎన్నికల మేనిఫెస్టోను శనివారం విడుదల చేసింది. ఆ పార్టీ అగ్రనేత, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈసారి తాము 24 హామీలు ఇస్తున్నామని, వాటిని నిబద్ధతతో అమలు చేస్తామన్నారు. అంతేకాకుండా బీహార్ అభివృద్ధికి ఇవి చాలా ముఖ్యమన్నారు. కోటి మంది యువతకు ఉద్యోగాలు, రాఖీ పండుగకు ఏటా పేద సోదరిమణులకు రూ.లక్ష ఇస్తామని, మెరుగైన అనుసంధానం కోసం బీహార్ ఐదు కొత్త విమానాశ్రయాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని, పాత పింఛన్ పథకాన్ని అమలుచేస్తామన్నారు. ప్రధాని మోదీ సమస్యలను పట్టించుకోకుండా ప్రజల దృష్టిని మరల్చడానికి ఇతర విషయాలపై మాట్లాడుతున్నారని తేజస్వీ మండిపడ్డారు. 'మేము ఏం చెబితే అదే చేస్తాం. బీహార్‌లో ఏం చెప్పామో అదే చేశాం. రిజర్వేషన్ పరిమితులు పెంచాం. కుల గణన చేశాం. నితీశ్ కుమార్ ప్రస్తుతం బీజేపీతో కలిసి పోటీ చేస్తున్నారు. నేను ఆయన్ను గౌరవిస్తాను. ఇప్పుడు ప్రధాని, సీఎం ఎందుకు మాట్లాడటం లేదు? బీహార్‌కు ప్రధాని నెరవేర్చిన ఒక్క హామీ అయినా ఉందేమో చెప్పాలి. మేము బీమార్‌కు ప్రత్యేక హోదా కావాలని అడుగుతున్నాం' అని తేజస్వీ యాదవ్ అన్నారు. బీహార్‌కు మొత్తం ఏడు దశల్లో 40 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మొదటి దశలో నాలుగు స్థానాల్లో, రెండు నుంచి ఐదు దశల వరకు ఒక్కొక్కసారి 5 స్థానాలకు, 6,7 దశల్లో 8 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## కేజ్రీవాల్ పిటిషన్‌పై రేపు సుప్రీంకోర్టులో విచారణ

**న్యూఢిల్లీ:** లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 15న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈడీ అరెస్టును సమర్థిస్తూ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ సవాలు చేశారు. మనీలాండరింగ్ కేసులో గత నెలలో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయగా, ఏప్రిల్ 15వ తేదీ వరకూ ఆయనను ఢిల్లీ కోర్టు జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. కేజ్రీవాల్ అరెస్టు చట్ట నిబంధనలకు లోబడే ఉందంటూ హైకోర్టు తీర్పు చెప్పింది. తగినన్ని సాక్ష్యాధారాలు ఈడీ వద్ద ఉన్నాయని తెలిపింది. అరెస్టు చేసిన సమయంపై దర్యాప్తు సంస్థను నిందించడం సరికాదని స్పష్టం చేసింది. లిక్కర్ పాలసీ రూపకల్పనలోనూ, ఇతర వ్యక్తులతో కుట్ర ఆరోపణల విషయంలోనూ కేజ్రీవాల్ ప్రమేయం ఉన్నట్టు కోర్టుకు అందజేసిన రికార్డులు స్పష్టంగా చెబుతున్నాయని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఇచ్చిన 103 పేజీల తీర్పు స్పష్టం చేసింది. ఇదే కేసులో అరెస్టయిన ఆప్ నేత మనీష్ సిసోదియా గత ఏడాది ఫిబ్రవరి నుంచి జైలులో ఉన్నారు. మరో ఆప్ నేత సంజయ్ సింగ్ ఇటీవలే బెయిలుపై జైలు నుంచి విడుదలయ్యారు.

## రాజకీయాల్లో 'నూబ్' ఎవరో?

### ప్రధాని మోదీ వ్యంగ్యం

**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్ వీడియో గేమ్స్‌తో పాపులారిటీ సంపాదించిన కొంతమంది గేమర్లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వీడియోను ప్రధాని తాజాగా పంచుకున్నారు. ఇందులో ప్రతిపక్షాలను విమర్శిస్తూ మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఆన్‌లైన్ గేమ్ పరిభాషలోని 'నూబ్'తో విపక్షాలను పోలుస్తూ ప్రధాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన గేమర్లు తీర్థ్ మెహతా, పాయల్ ధరె, అనిమేశ్ అగర్వాల్, అన్షు బిష్త్, నమన్ మథుర్, మిథిలేశ్ పటాంకర్, గణేశ్ గంగాధర్ ఇటీవల ప్రధాని నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా గేమర్లతో కలిసి మోదీ కొంతసేపు ఆన్‌లైన్ గేమ్ ఆడారు. ఆ సమయంలో 'నూబ్' అని వినిపించగానే ప్రధాని నవ్వుతూ...'ఈ పదాన్ని నేను ఎన్నికల్లో ఉపయోగిస్తే ఎవర్ని అంటున్నానా అని ప్రజలు ఆశ్చర్యపోతారు. ఒకవేళ ఆ పదం నేను చెబితే మీరు వెంటనే ఓ వ్యక్తిని ఊహించుకుంటారు' అంటూ పరోక్ష విమర్శలు చేశారు. ఆన్‌లైన్ గేమర్ల భాషలో 'నూబ్' అంటే ఆటకు కొత్తగా వచ్చిన లేదా ఆ రంగంలో నైపుణ్యం లేని వ్యక్తి అని అర్థం. మోదీ తన వ్యాఖ్యల్లో ఏ నాయకుడి పేరును ప్రస్తావించనప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూనే ఈ విమర్శలు చేశారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా, మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ స్పందిస్తూ 'ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పాటిస్తున్న రాజకీయ వ్యూహాలివి. వారికి తప్పకుండా ఎదురుదెబ్బ తగులుతుంది' అని అన్నారు.

## ఆ దొంగను శిక్షించవద్దు: సోనూసూద్



**గురుగ్రామ్:** గురుగ్రామ్‌లోని ఓ ఇంటికి ఫుడ్ డెలివరీ చేయడానికి వచ్చిన బాయ్... బయటే ఉన్న విలువైన నైక్ షూస్‌ని దొంగిలించాడు. ఈ మధ్యే జరిగిన ఈ ఘటన తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దొంగతనం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిందితుడిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్న తరుణంలో సినీనటుడు సోనూ సూద్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. డెలివరీ బాయ్‌కి మద్దతు తెలుపుతూ సోనూ ఓ పోస్ట్ చేశారు. దొంగతనం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవద్దని అధికారులను కోరారు. 'స్విగ్గీ డెలివరీ బాయ్ ఒకరి ఇంట్లో ఫుడ్ డెలివరీ చేస్తున్నప్పుడు బూట్లు దొంగిలించినట్లయితే.. అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు. వీలైతే అతనికి కొత్త షూ కొనండి. నిజంగా అతనికి అవి అత్యవసరం కావచ్చు. అతనిపట్ల కాస్త దయగా ఉండండి' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు సోనూసూద్‌ను సమర్థిస్తుండగా... మరికొందరు మండిపడుతున్నారు. కాగా, సోనూసూద్ అభిమానులు ఆయన పోస్ట్‌ని అభినందిస్తున్నారు. అయితే ఆ పోస్ట్ నచ్చని మరికొందరు నిందితుడిపై చర్యలు తీసుకోకూడదని చెప్పడం సరేకానీ...అర్థం లేని వ్యాఖ్యలతో దొంగను సమర్థించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. పేదరికం, అవసరం దొంగతనానికి ప్రేరేపించదు. అలాగైతే లక్షల సంఖ్యలో ఉన్న ప్రజలు, డెలివరీ బాయ్‌లు దొంగతనాలు చేసి బతికేవారని, కానీ వారు అలా చేయట్లేదని అంటున్నారు. వారంతా కష్టపడి పని చేసి డబ్బు సంపాదిస్తున్నారని కౌంటర్ ఇస్తున్నారు.

## నేడు బీజేపీ మేనిఫెస్టో విడుదల

**న్యూఢిల్లీ:** 'మోదీస్ గ్యారెంటీ: డవలప్డ్ ఇండియా 2047' అనే థీమ్‌తో లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ సిద్ధం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా బీజేపీ మేనిఫెస్టో ఏప్రిల్ 14వ తేదీ ఆదివారం విడుదల కానుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. బీజేపీ మేనిఫెస్టో ప్రధానంగా అభివృద్ధిపై దృష్టి సారించనుంది. అభివృద్ధి భారతం లక్ష్యంగా మహిళలు, యువత, పేదలు, రైతుల అభ్యున్నతికి మేనిఫెస్టో భరోసా ఇవ్వనుంది. సాంస్కృతిక జాతీయవాదంపై దృష్టిసారిస్తూ 2047 నాటికి అభివృద్ధి భారతం సాధిస్తామనేది మోదీ ప్రధాన గ్యారెంటీగా ఉండనుంది. కాగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని మేనిఫెస్టో కమిటీ ఇప్పటికి రెండుసార్లు సమావేశమైంది. మేనిఫెస్టో కోసం 15 లక్షల సూచనలు బీజేపీకి వచ్చాయి. వాటిలో 4 లక్షల సూచనలు నమో యాప్ ద్వారా, 11 లక్షల సలహాలు వీడియోల రూపంలో వచ్చాయి. 27 మందితో కూడిన బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కో-ఆర్డినేటర్‌గా, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కో-కోఆర్డినేటర్‌గా ఉన్నారు.

## భరతమాత నినాదం రగడ

**బెంగళూరు:** బహిరంగ వేదికపై భారతమాతను కీర్తించేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అనుమతి కోరడం కర్నాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వైరల్‌గా మారిన వీడియోపై స్పందించిన బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని కల్బుర్గిలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన బహిరంగ ర్యాలీలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎమ్మెల్యే లక్ష్మణ్ సావడి మాట్లాడుతూ 'మీ అందరికి ఒకటి చెప్పాలనుకుంటున్నా. దీనిని ఖర్గే తప్పుగా అర్థం చేసుకోరని ఆశిస్తూ... నేను 'బోలో భారత్ మాతాకీ జై' అని నినదిస్తా. పిడికిలి బిగించి మీరంతా నాతో పాటు దీన్ని పునరావృతం చేయాలి' అని ప్రజలను కోరారు. అయితే బీజేపీ దీనిని తీవ్రంగా తప్పుపట్టింది. 'కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయని ఈ ఘటన చూస్తే అర్థమవుతోంది. భారతమాత పేరును నినదించాలన్నా, దేశభక్తిని చాటాలన్నా అక్కడ పైనుంచి అనుమతులు కావాలి. ఇది ఎంతో ప్రమాదకరం. దేశభక్తిని నిరూపించుకునేందుకు సావడి వ్యర్థ ప్రయత్నం చేశారు. ఇలాంటి పరిస్థితి బీజేపీలో మాత్రం లేదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర విమర్శించారు. పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన వారి పక్షాన ప్రియాంక్ ఖర్గే ఎలా వాదించారో గతంలో చూశామని బీజేపీ గుర్తు చేసింది.

## బోర్నవిటా ఆరోగ్య పానీయం కాదు: కేంద్రం

**న్యూఢిల్లీ :** బోర్నవిటాతో పాటు ఇతర సంబంధిత ఉత్పత్తులను ఆరోగ్య పానీయం విభాగం నుంచి తొలగించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఇ-కామర్స్ కంపెనీలను ఆదేశించింది. భారత ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల సంస్థ 2006లో తీసుకొచ్చిన ఆహార భద్రతా, ప్రమాణాల చట్టంలో హెల్త్ డ్రింక్‌కు సరైన నిర్వచనం లేదని జాతీయ పిల్లల హక్కుల రక్షణ కమిషన్ విచారణలో వెల్లడైందని కేంద్రం ఏప్రిల్ 10న జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ క్రమంలోనే అన్ని ఇ-కామర్స్ కంపెనీలు, పోర్టల్స్ బోర్నవిటా సహా ఇతర సంబంధిత ఉత్పత్తులను ఆరోగ్య పానీయాల విభాగం నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. బోర్నవిటాలో అధిక చక్కెర ఉందంటూ ఇన్‌ఫ్లూయెన్సర్ ఒకరు వీడియోను పోస్ట్ చేయడం వల్ల ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇందులోని కొన్ని పదార్థాలు పిల్లలకు హాని కలిగించేలా ఉన్నాయంటూ పేర్కొన్నాడు.

# సమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ, వైసీపీని ఓడించండి
- సీపీఐ విజయవాడ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

**విశాలాంధ్ర-విజయవాడ:**
రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ద్రోహం చేసిందని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి.కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక 40, 54వ డివి జన్‌లలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఒక్క అవకాశం ఇవ్వండి అని అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్... మూడు రాజధానుల పేరుతో ఏకంగా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని చెప్పారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బీజేపీ, వైసీపీ అభ్యర్థులు ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని, వారిని ప్రతి ఒక్కరూ ఈ అంశంపై ప్రశ్నించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఏపీకి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విభజన హామీలు అమలు చేయకుండా అన్యాయం చేసిందన్నారు. తమ పార్టీ తరపున 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధిస్తామని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక కేంద్రానికి తానే మెడలు వంచి రాష్ట్రానికి ద్రోహం చేశారని మండి పడ్డారు. బీజేపీ, వైసీపీ చేసిన మోసంవల్ల రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని, ఉద్యోగ, ఉపాధి అవకా శాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలతో కూడి ఇండియా కూటమి అధి కారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఫైలుపై తొలి సంతకం ప్రధాని చేస్తారని, విభజన హామీలు అమలు చేస్తామని, అమరావతినే రాజధానిగా కొన సాగిస్తామని చెప్పారు. బీజేపీ కూటమిని, వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న తనను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తొలుత ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, కేవీ భాస్కరరావు, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యుడు దోనేపూడి సూరిబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, నగర కార్యదర్శి లంకా గోవింద రాజు, శిరం రవి, క్రాంతి, అయ్యప్ప, టీ పూర్ణయ్య, బీ ఆంజనేయులు, బీ రవి, టీ వెంకటేశ్వరరావు, కొట్టు విజయలక్ష్మి, శర్మ, దాసరి రంగరావు, భాషా, రాంబాబు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుకను అసెంబ్లీకి పంపుదాం

**సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు పౌర ప్రజాసంఘాల మద్దతు**

**విశాలాంధ్ర-విశాఖ:**
కేంద్రంలోని బీజేపీతో ప్రత్యక్షంగా అంటకాగుతున్న టీడీపీ, జనసేన, పరోక్షంగా కలిసినడుస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీలను ఓడించి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా అసెంబ్లీలో ప్రజా గొంతుక వినపడేందుకు తాము కృషి చేస్తామని విశాఖలోని వివిధ పౌర, ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేశారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ... విశాఖలో పౌర, ప్రజాసంఘాల నేతలు మద్రిపాలెంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలకు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదని, గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఏ ఒక్కటీ అమలు చేసిన పరిస్థితి లేదని విమర్శించారు. విభజన సమయంలో కేంద్రం ప్రకటించిన హామీలు అమలు కాలేదని, వాటిని సాధించేందుకు ప్రస్తుత అధికార వైసీపీ, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యాయని విమర్శించారు. స్వప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వైసీపీ, ఎన్డీఏ కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల, విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి.చంద్రశేఖర్, ఐద్వా నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు సోడిదాసు సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం మన్మథరావు, ఇన్సాఫ్ జిల్లా నాయుకులు ఎస్కే రెహమాన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ ఇన్‌ఛార్జి కసిరెడ్డి సత్యనారాయణ, ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ నేత జి.వామనమూర్తి, ఏపీ మత్స్య కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగభూషణరావు, వాసుపల్లి నల్లయ్య, కోడా వజ్రం, ఆదినారాయణ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎండీ బేగం, అధ్యక్షురాలు వనజాక్షి, పుష్పలత, ప్రజా నాట్య మండలి నాయకులు దేవుడమ్మ, డీహెచ్‌పీఎస్ నేత ఏ రవి, అరసం ప్రతినిధి క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలోకి ఎన్డీయే నేతలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
ఎన్డీయే కూటమికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కీలక నేతలు సీఎం జగన్ సమక్షంలో శనివారం వైసీపీలో చేరారు. గుంటూరు జిల్లా నంబూరు బైపాస్ నైట్ స్టే పాయింట్ వద్ద గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాల నుంచి వచ్చిన ఆయా పార్టీ నేతలకు సీఎం జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మంగళగిరి నియోజకవర్గ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.రఘుపతిరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సురేంద్ర కుమార్, కాపుసంఘం యువజన విభాగం అధ్యక్షుడు పెండ్యాల వెంకటరమణ వైసీపీలో చేరారు. వైసీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య పాల్గొన్నారు.

# జగన్ రోడ్ షో

- ఎన్టీఆర్ జిల్లాలోకి బస్సు యాత్ర
- కనకదుర్గ వారధి దగ్గర భారీ స్వాగతం
- వైసీపీ అభ్యర్థులతో కలిసి సీఎం అభివాదం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర శనివారం సాయంత్రం విజయవాడకు చేరుకుంది. గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి కనకదుర్గ వారధి మీదుగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోకి బస్సు యాత్ర ప్రవేశించింది. ఈ బస్సు యాత్రకు వైసీపీ నేతలు, శ్రేణులు భారీగా స్వాగతం పలికారు. కనకదుర్గ వారధి దగ్గరకు వైసీపీ విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, తూర్పు, సెంట్రల్, పశ్చిమ అభ్యర్థులు దేవినేని అవినాశ్, వెలంపల్లి శ్రీనివాస్, అసిఫ్, నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్ రావు, సామినేని ఉదయభాను తదితరులు చేరుకుని సీఎంతో పాటు బస్సులో ఉండి యాత్రలో పాల్గొన్నారు. అక్కడి నుంచి వైసీపీ శ్రేణులు, అభిమానులు బస్సు యాత్రను అనుసరిం చారు. వారధి నుంచి శిఖామణి సెంటరు మీదుగా విశాలాంధ్ర రోడ్డు, చుట్టుగుంట, అల్లూరి సీతారామరాజు వంతెన నుంచి బస్సు యాత్ర కొనసాగింది. వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, వెలంపల్లి శ్రీనివాస్ అధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేపట్టారు. భారీ గజమాలలు, డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. దారిపొడవునా జగన్‌ను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు బారులుతీరారు. గుమ్మడికాయలతో దిష్టితీసి, హారతులతో వారి అభిమానాన్ని చాటుకున్నారు. జగన్ బస్సు యాత్ర చుట్టుగుంట నుంచి బీఆర్‌టీఎస్ రోడ్, పైపుల రోడ్, రామవరప్పాడు, నిడమానూరు మీదుగా కొనసాగింది. అనంతరం కేసరపల్లిలోని బస చేసే ప్రాంతానికి జగన్ చేరు కున్నారు. సీఎం బస్సు యాత్రను పురస్కరించుకుని విజయవాడ నగరంలోని ట్రాఫిక్‌ను పోలీసులు దారిమళ్లించారు. ఆయా ప్రాంతాలకు అనుగుణంగా బస్సు యాత్ర వచ్చే సమయానికి ముందస్తుగా వాహనాల రాకపోకల్లో మార్పులు చేశారు.

**జనంలో ఉండి జగన్‌కు భారతి సంఘీభావం**

తాడేపల్లి జంక్షన్‌లో బస్సు యాత్రకు సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రికి ఆమె అభివాదం చేశారు. ప్రతిగా బస్సులో నుంచి ఆమెకు జగన్ అభివాదం చేశారు. ప్రజలు, అభిమానుల మధ్య నుంచే సీఎంకు ఆమె అభివాదం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జగన్ నిర్వహించిన రోడ్ షోలో భారతి పాల్గొనడం ఇదే ప్రథమం. అనంతరం భారతితో స్థానికులు సెల్ఫీలు దిగారు.

**మంగళగిరిలో చేనేత కార్మికులతో జగన్ ముఖాముఖి**

సీఎం జగన్ 14వ రోజు బస్సు యాత్రలో భాగంగా తొలుత శనివారం ఉదయం గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో చేనేత కార్మికులతో జగన్ ముఖాముఖి నిర్వహించారు. మంగళగిరి వైసీపీ అభ్యర్థి లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేతలు గంజి చిరంజీవి, వాసిరెడ్డి పద్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్ మాట్లాడుతూ నేతన్నల సంక్షేమ కోసం గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. నేతన్నల కోసం రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. చేనేత వర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలకు వైసీపీ అవకాశం ఇచ్చిందన్నారు. మంగళగిరిలో బీసీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, చంద్రబాబు తన కొడుకుకు ఈ సీటు ఇచ్చారని చెప్పారు. టీడీపీ నేతలు డబ్బుతో వస్తున్నారని, వారిచ్చే డబ్బులు తీసుకోండి కానీ, ఓట్లు మాత్రం వైసీపీ అభ్యర్థి లావణ్యకే వేయాలని కోరారు.

## బెజవాడలో ఈదురుగాలులతో వర్షం

**చల్లబడిన వాతావరణం**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
విజయవాడలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం వరకు అధికంగా ఉన్న ఉష్ణోగ్రతలు... ఈదురుగాలులు, వర్షం కురవడంతో ఒక్కసారిగా చల్లబడింది. ఎండలు, ఉక్కపోతతో గత పది రోజులుగా అల్లాడిపోయిన నగర ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. కొద్దిపాటి వర్షానికే కొన్ని ప్రాంతాల్లో వీధులు జలమయమయ్యాయి. మరోవైపు అదే సమయానికి వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సుయాత్ర విజయవాడలో ప్రవేశిస్తుండగా ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్థంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బస్సు యాత్రను తిలకించేందుకు రోడ్లపైకి వచ్చిన ప్రజలు, ఆ పార్టీ కార్యకర్తలు ఈదురుగాలులు, వర్షం కారణంగా కకావికలమయ్యారు. అయితే కొద్ది సేపటికే సాధారణ వాతావరణం నెలకొనడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఉత్తర కోస్తాలో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని తెలిపింది. దక్షిణ కోస్తాలో మాత్రం వాతావరణం పొడిగానే ఉంటుందని వివరించింది. రాయలసీమ జిల్లాల్లో మాత్రం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## చేనేతలకు జగన్ శూన్యహస్తం

- టీడీపీ హయాంలో 50 ఏళ్లలోపు పింఛన్
- 119 కోట్ల రుణమాఫీ: మాజీ ఎంపీ నిమ్మల

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
చేనేతలపై జగన్ చెప్పినవన్నీ అబద్ధాలేనని... తాడేపల్లి ప్యాలెస్ వదలని సీఎంకు చేనేతలు అంటే ఎవరో అసలు తెలియదని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప విమర్శించారు. టీడీపీ జూమ్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు చేనేతలపై జగన్ కపట ప్రేమ చూపుతున్నారని, ఆయన పాలనలో దాదాపు 100 మంది చేనేత కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉచిత విద్యుత్ సబ్సిడీకి గండి కొట్టారని, వారిపై దాడులు పెరిగాయన్నారు. చంద్రబాబు పెట్టిన నేతన్న నేస్తాన్ని జగన్ పెట్టానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హయాం లోనే చేనేతలకు మేలు జరిగిందని గుర్తు చేశారు. సుమారు 119 కోట్ల చేనేతల రుణాలు మాఫీ చేసి చేనేతలకు మేలు చేశారన్నారు. 50 ఏళ్లలోపు చేనేతలకు పింఛన్ అందించి భరోసా కల్పించారన్నారు. చేనేతలకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలు అందకుండా జగన్ తుంగలో తొక్కాడని మండిపడ్డారు. ఎన్నికల్లో తప్పకుండా చేనేత కార్మికులు జగన్‌కు బుద్ధి చెబుతారని కిష్టప్ప పేర్కొన్నారు.

## ఎన్ఆర్ఐపై రూ.2 కోట్ల రివార్డు

**వాషింగ్టన్:**
తొమ్మిదేళ్లక్రితం అమెరికాలో భారత్‌కు చెందిన ఒక వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతంగా కత్తితో పొడిచి చంపి పరారయ్యాడు. ఈ ఘటనలో నిందితుడైన భద్రేశ్ కుమార్ చేతన్‌భాయ్ పటేల్‌ను అగ్రరాజ్య ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) టాప్ టెన్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. తాజాగా అతని తలపై భారీ రివార్డును ప్రకటించింది. నిందితుని ఆచూకీ తెలిపిన వారికి 2,50,000 డాలర్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.2 కోట్లకు పైమాటే) ఇస్తామని వెల్లడించింది. 2015 ఏప్రిల్ 12న మేరీల్యాండ్‌లోని హానోవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రేశ్ పటేల్, అతడి భార్య పాలక్ స్థానికంగా ఉండే ఒక డోనట్ దుకాణంలో పని చేసేవారు. హత్య జరిగిన రోజున వీరిద్దరూ నైట్ షిఫ్ట్‌లో ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ దుకాణంలోని కిచెన్‌లో పని చేస్తున్న పాలక్ దగ్గరకు అతను వెళ్లి అనేక సార్లు కత్తితో పొడిచాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎఫ్‌బీఐ అధికారులు నిందితుడి కోసం తీవ్రంగా గాలించారు. హత్య అనంతరం తన అపార్ట్‌మెంట్‌కు వచ్చిన భద్రేశ్ కొన్ని వస్తువులు తీసుకుని న్యూజెర్సీ ఎయిర్‌పోర్టుకు వెళ్లినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. అతని జాడ లేదు. జాడలేదు. అప్పటినుంచి నిందితుడి కోసం గాలిస్తున్న ఎఫ్‌బీఐ... 2017లో అతడిని టాప్‌టెన్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. తాజాగా రివార్డు ప్రకటించింది. వీసా గడువు తీరడంతో పాలక్ భారత్ తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకుందని, ఇది నచ్చని ఆమె భర్త ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. నిందితుడు భద్రేశ్ కెనడా పారిపోయి ఉంటాడని లేదా భారత్‌కు తిరిగి వెళ్లి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## యూపీలో 'ఇండియా' అభ్యర్థులకు బేషరతుగా మద్దతు: ఆప్

**లక్నో:**
ఉత్తర ప్రదేశ్‌లో 'ఇండియా' కూటమి అభ్యర్థులకు బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, నిరంకుశ ప్రభుత్వాన్ని అంతం చేయడానికి ఈ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొంది. ఆప్ నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఉత్తర ప్రదేశ్‌లో 'ఇండియా' కూటమి అభ్యర్థులకు తమ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే తమ పాత్ర ఏమిటి, ప్రచారంలో ఎవరు పాల్గొంటారనేది కాంగ్రెస్‌తో చర్చించిన తర్వాత నిర్ణయిస్తామని చెప్పారు. ఎస్పీ అభ్యర్థులకు పూర్తిగా మద్దతు ఇస్తామని అన్నారు. దీని కోసం ఎలాంటి షరుతులు లేదా డిమాండ్లు లేవని స్పష్టం చేశారు. కాగా, ఎస్పీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన ఆప్‌కు అఖిలేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ఎన్నికలు సాధారణ పరిస్థితుల్లో జరగడం లేదని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపారంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీ ఇలా చేస్తోందని విమర్శించారు.

## చిప్కో ఉద్యమ నేత మురారీలాల్ కన్నుమూత

**రుషికేశ్:**
చిప్కో, సర్వోదయ ఉద్యమాల నేత, సామాజిక కార్యకర్త మురారి లాల్ (91) కన్నుమూశారు. రుషికేశ్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో శ్వాస సంబంధిత అనారోగ్యానికి చికిత్స పొందుతూ మరణించారు. చిప్కో ఉద్యమ మాతృసంస్థ అయిన దశోలీ గ్రామ స్వరాజ్య మండల్‌కు మురారీలాల్ అధ్యక్షుడిగా పని చేశారు. మురారీలాల్ తన స్వగ్రామంలోని బంజరు భూములను సస్యశ్యామలంగా మార్చడంతో పాటు సహజ వనరుల సంరక్షణ, వినియోగానికి సంబంధించి వినూత్న విధానాలను రూపొందించి గుర్తింపు పొందారు. లాల్ మృతికి ప్రముఖ పర్యావరణవేత్త చండీ ప్రసాద్ భట్ సహా అనేక మంది సంతాపం వ్యక్తం చేశారు. కాగా, మురారీలాల్ సేవలను ఉత్తరాఖండ్ ప్రభుత్వంతో పాటు ఇతర సంస్థలు గుర్తించి గౌరవించాయి.

## బీజేపీకి అధికారం ఓ కల

**సిద్ధరామయ్య స్పష్టీకరణ**

**మైసూరు:**
రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని తక్కువగా అంచనా వేయవద్దని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు ఎన్‌డీఏకు రావడం కష్టమేనని వ్యాఖ్యానించారు. 400 సీట్లు సాధిస్తామని బీజేపీ చెబుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ లేని ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడుతుందని సిద్ధరామయ్య జోస్యం చెప్పారు. కాషాయపార్టీకి దేశంలో అంతర్లీనంగా తీవ్ర వ్యతిరేకత ఉందని ఆయన తెలిపారు 'కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు అసాధ్యం. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో నిశబ్ద ఓటింగ్ జరుగుతుంది. ఫలితాలు వచ్చినప్పుడు మీరే చూస్తారుగా' అని సిద్ధరామయ్య పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంచేశారు. 'నాకున్న సమాచారం ప్రకారం బీజేపీ చేయించుకున్న సర్వేలోనే ఆ పార్టీకి 200కు పైగా సీట్లు వస్తాయి. బీజేపీ సొంతంగా అధికారం చేపట్టే ప్రసక్తేలేదు' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'ఎన్నికల తర్వాత రాజకీయ పార్టీల పున:పొందిక జరుగుతుంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఒడిశా, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ, దక్షిణాదికి చెందిన ప్రాంతీయ పార్టీల నాయకులు ఏకతాటిపైకి రానున్నారు' అని సిద్ధరామయ్య వివరించారు. ఈసారి బీజేపీకి సీట్లు తగ్గడానికి గల కారణాలు వివరిస్తూ...2014 నుంచి ఎన్నికల హామీలు ఒక్కటీ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేయలేదన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల రెండు ప్రధాన సమస్యలు బీజేపీకి ఇబ్బందిగా మారాయన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ విజయావకాశాల గురించి ప్రస్తావిస్తూ పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. 'కర్నాటకకు సంబంధించినంత వరకు మాకు అనుకూలంగా ఉంది. అసెంబ్లీలో సాధించిన ఓటు షేర్‌ను అందిపుచ్చుకుంటాం. కర్నాటకలో 15 నుంచి 20 సీట్లు గెలిచితీరతాం' అని నమ్మకంగా చెప్పారు. బీజేపీ-జేడీఎస్ కూటమి గురించి మాట్లాడుతూ జేడీఎస్ నేత కుమారస్వామి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వంటి వాడేనని చెప్పారు. 'నితీశ్‌కుమార్ రాజకీయ అవకాశవాది. అదేవిధంగా కుమారస్వామి కూడా రాజకీయ అవకాశవాది. బీజేపీ మతతత్వ పార్టీ. జేడీఎస్ కూడా ఇప్పుడు మతోన్మాదపార్టీగా మారింది' అని సిద్ధరామయ్య ఆరోపించారు. భవిష్యత్‌లో బీజేపీలో జేడీఎస్ విలీనమవుతుందని జోస్యం చెప్పారు. అదేసమయంలో కొంతమంది జేడీఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖంగా ఉన్నారని, అయితే ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేనని ముఖ్యమంత్రి అన్నారు.

## ప్రతి రైతుకూ ఒక ఆవు

- పెద్దిరెడ్డి, లోకేశ్‌లపై పోటీ: రామచంద్రయాదవ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:**
రాజధాని పరిరక్షణ కోసం తాను మంగళగిరి నుంచి పోటీ చేస్తున్నట్లు భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన పుంగనూరులో వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంగళగిరిలో చంద్రబాబు తనయుడు నారా లోకేశ్‌పైనా పోటీకి దిగుతున్నట్లు ఆయన వెల్లడించారు. హ్యాపీ రిసార్ట్స్ లో శనివారం నియోజకవర్గంలోని అభిమానులు, కార్యకర్తలు, ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పుంగనూరు, మంగళగిరిలో ఎందుకు పోటీ చేస్తున్నాను అనే దానిపై క్లారిటీ ఇచ్చారు. తమ పార్టీ రెండు ప్రధాన వైసీపీ, టీడీపీలకు సమదూరమని చెప్పారు. అందుకే వైసీపీలో నెంబర్ 2 గా ఉన్న పెద్దిరెడ్డిపై, ఇటు టీడీపీలో నెంబర్ 2 గా ఉన్న నారా లోకేష్ పై బరిలో దిగినట్లు తెలిపారు. రాజధాని పరిరక్షణ కోసం మంగళగిరి నుంచి బరిలోకి దిగుతున్నానని, ఖచ్చితంగా రెండు నియోజకవర్గాల్లోనూ విజయం సాధించి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయి ప్రణాళికతో ఉన్నామని, తాను గెలిస్తే ప్రతి రైతుకీ ఒక ఆవు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు నెల రోజుల్లో ఉద్యోగం లేదా ఉపాధి కల్పిస్తానని చెప్పారు. మంగళగిరి కేంద్రంగా చేనేత పరిశ్రమ ఏర్పాటు, ఐదేళ్లలో 25 వేల మంది యువతకు శాశ్వత ఉద్యోగాల కల్పన, రాజధాని ప్రాంతంలో 25 వేల మంది పేదలకు పక్కా గృహాల నిర్మాణం చేపడతామని రామచంద్రయాదవ్ హామీ ఇచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

# సమరాంగణం 2024

# బెగూసరాయ్ అంటే అవధేశ్ రాయ్

బీహార్ లెనిన్‌గ్రాడ్‌గా పేరొందిన బెగూసరాయ్‌లో నామినేషన్ల దాఖలు పూర్తికాక ముందే పరిస్థితి ఏమిటో అర్థమై పోతోంది. ప్రజా పోరాటాల ప్రభంజనానికి మతతత్వ రాజకీయాలు, అసత్య ప్రచారం, పార్టీ ఫిరాయింపులు, విద్వేషం, కోతల రాయుళ్ల బండారం బయట పడిపోనుంది. ఇవన్నీ వీగిపోతాయి. గత అయిదేళ్ల కాలంలో బెగూసరాయ్ ఎంపీగా ఉన్న గిరి రాజ్ సింగే ఇప్పుడూ అధికారపక్ష అభ్యర్థి. అయిదేళ్లలో ఆయన చేసిందల్లా "హిందుస్థాన్-పాకిస్థాన్", "హిందూ-ముసల్మాన్", "ఝట్కా మాంసం" గురించే మాట్లాడడమే.

సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన, ఒక పూట తింటే మరో పూట లేని వ్యక్తిని, నిఖార్సైన నిజాయితీ పరుణ్ని "ఇండియా" ఐక్య సంఘటన ఈ సారి రంగంలోకి దించింది. ఆయన దగ్గర గుమ్మరించడానికి డబ్బులు లేకపోవచ్చు. అయినా సమాజం మార్పు కోసం నిజాయితీగా పోరాడే సామర్థ్యం ఉన్న వ్యక్తి. ఆయన మూడు సార్లు బచ్వాడా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనకు పురోగమన భావాలు ఉన్నందు వల్ల ప్రజా సమస్యలను పరిష్కరించడానికీ, సంక్షేమ కార్యకలాపాలను అమలు చేయించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చారు. ఇందులో అనేక విజయాలూ సాధించారు. ఆయన మరెవరో కాదు సీపీఐ నేత అవధేశ్ రాయ్.

బీజేపీ అభ్యర్థికి ఎన్నికలలో డబ్బు గుమ్మరించడానికి ఎన్నికల బాండ్ల ద్వారా పోగేసిన కోట్లాది రూపాయలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిపక్ష అభ్యర్థి అయిన అవధేశ్ రాయ్ దగ్గర ఉన్నదల్లా అభిమానంతో చిన్న చిన్న మొత్తంలో జనం ఇస్తున్న విరాళాలే. ఆయన తరఫున ప్రచారం చేసే వారు ఆకలి భరించి, కాలినడకన, సైకిళ్ల మీద, ద్విచక్ర వాహనాల మీద నిరాడంబరంగా ప్రచారం చేస్తున్నారు. సకల సరంజామా ఉన్న గిరిరాజ్ సింగ్‌తో ఏ వనరులూ లేని అవధేశ్ రాయ్ తలపడుతున్నారు. జనం నుంచి ఆయనకు సమకూరుతున్న మద్దతు చూస్తుంటే బెగూసరాయ్ ప్రజల గౌరవభావాలు, ఆత్మ గౌరవం నిలబెట్టేది అవధేశ్ రాయ్ మాత్రమేనన్న అభిప్రాయం క్రమంగా బలపడుతున్నట్టు రూఢి అవుతోంది.

అవధేశ్ రాయ్‌కు సమకూరుతున్న మద్దతు చూస్తే మోదీ మాయ నుంచి బయటపడాలన్న ఆకాంక్ష జనంలో బలంగా ఉన్నట్టు రుజువవుతోంది. "ఈ సారి బెగూసరాయ్ జనం మద్దతు అవధేశ్ రాయ్" కే అన్న నినాదాలు మిన్నంటుతున్నాయి. అవధేశ్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకుడు. ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా" ఆయనను ఈ సారి రంగంలోకి దించింది. అవధేశ్ రాయ్ రంగంలోకి దిగిన తరవాత బీజేపీ అభర్థి గిరిరాజ్ సింగ్ వెన్నులో వణుకు మొదలైంది. మందిరం, మసీదు లాంటి మాయమాటలను ఈ సారి జనం విశ్వసించేట్టు లేరు. రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, వివిధ మతాలను అనుసరించే వారు అవధేశ్ రాయ్‌కు అండగా నిలుస్తున్నారు.

ఈ వాతావరణం చూసి బీజేపీ అభ్యర్థి గిరిరాజ్ సింగ్‌కు గంగానదికి ఆవల ఉన్న తన స్వగ్రామం గుర్తొస్తూ ఉండి ఉంటుంది. గత అయిదేళ్లు ఎంపీగా ఉండి బెగూసరాయ్‌కి ఆయన చేసిందేమీ లేదు. ఆయన ఏ దళారులకు మేలు చేశారో జనానికి తెలిసిపోయింది. గిరిరాజ్ సింగ్ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న చోటల్లా జనం ఛీ కొడ్తున్నారు. మా బాధలకు కారకుడివి నువ్వే అని జనం గిరిరాజ్ సింగ్‌ను నిలదీస్తున్నారు. మండుతున్న ధరలకు తాళ లేక జనం బతుకులు మాడిపోతున్నాయి. రైతులు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ కార్మికులు, కూలినాలి చేసుకునే ఇతరులు వలస పోతున్నారు. యువత నిరుద్యోగంతో అల్లడిపోతున్నారు. విద్యార్థులు నాసిరకం పాఠ్యప్రణాళికలు చూసి చీదరించుకుంటున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసం కావడం, ఇతర మతాల వారిని చూస్తే అసహనం విపరీతంగా పెరిగిపోవడం ప్రజలను విచలితుల్ని చేస్తోంది. అసలు సమస్యలను మరుగు పరిచి హిందూ-ముస్లింల మధ్య సోదర భావాన్ని అంతం చేసి దేశాన్ని అల్లకల్లోలం చేయడాన్ని జనం ప్రశ్నించడం మొదలు పెట్టారు.

అహంకార పూరితుడైన గిరిరాజ్ సింగ్ బెగూసరాయ్ మానవతను మంటగలిపారు. ఇలాంటి వారి ఆగడాలను జనం ఎన్నాళ్లు, ఎలా సహిస్తారుగనక. మాతృ భూమి పేరు చెప్పి ఓట్లడిగే బీజేపీ భూమి, ఆకాశం, కడకు పాతాళాన్ని కూడా అమ్మేస్తోంది. దేశాన్ని కొల్లగొట్టడానికి మీకు ఇంకేమి కావాలని అధికార పక్షాన్ని జనం నిలదీస్తున్నారు. ఈ ప్రశ్నలు విని బీజేపీ నాయకులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. భక్తి భావం నుంచి జనాన్ని దూరం చేసి అంధ భక్తులుగా మార్చడాన్ని ప్రజలు సహించలేక పోతున్నారు.

ఈ సారి అధికార మదోన్మత్త బీజేపీతో ప్రజలే నేరుగా తలపడనున్నారు. ఈ క్రమంలో సీపీఐ అభ్యర్థి అవధేశ్ రాయ్ జనం కళ్లముందు చెమక్కున మెరిశారు. జనం మద్దతుతో విజయ పథంలో సాగిపోతున్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించగలిగేది ప్రతిపక్ష ఐక్య సంఘటనే అని ప్రజలకు తెలుసు. ఈ కర్తవ్య నిర్వహణలో సీపీఐ ముందుంటుందనీ జనం గ్రహించారు. బెగూసరాయ్ ఒకప్పుడు కమ్యూనిస్టుల కోట. మళ్లీ ఆ కోటను స్వాధీనం చేసుకోవడానికి అవధేశ్ రాయ్ జనం బలంతో బలంగా అడుగు ముందుకేస్తున్నారు. బెగూ సరాయ్ నియోజకవర్గ ప్రజలు కమ్యూనిస్టు యోధుడు చంద్రశేఖర్ సింగ్‌ను ఒకప్పుడు ఎన్నుకున్నారు. చరిత్ర పునరావృతమయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

జనం వస్తున్నారు సింహాసనం ఖాళీ చేయండి

## రాజస్థాన్ కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ

జైపూర్: కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ శాఖలో పొత్తులపై అసమ్మతి కుంపటి రాజుకుంది. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ(ఆర్ఎల్‌పీ)తో పొత్తును వ్యతిరేకిస్తూ ఒకేసారి 400 మంది కార్యకర్తలు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ ఘటన రాష్ట్రంలో రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. హస్తం పార్టీ నాయకత్వం ఖంగుతింది. లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ(ఆర్ఎల్‌పీ) మధ్య పొత్తు ఖరారైంది. పొత్తులో భాగంగా నాగౌర్ లోక్‌సభ స్థానం నుంచి ఆర్ఎల్‌పీ చీఫ్ హనుమాన్ బేనివాల్ పోటీలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఈ నియోజకవర్గానికి బేనివాల్ పేరును ఖరారు చేసింది. కాంగ్రెస్ నేతలకు బేనివాల్ ఎంపిక నచ్చలేదు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ నేతలు బీజేపీ అభ్యర్థి జ్యోతి మిర్ధాకు అనుకూలంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయం తెలిసి బేనివాల్ కాంగ్రెస్ నేతల వ్యవహారంపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. అసలు విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం దిద్దుబాటులో చర్యలో భాగంగా ముగ్గురు కాంగ్రెస్ నేతలను ఆరేళ్ల పాటు సస్పెండ్ చేసింది. సస్పెండ్ అయిన వారిలో మాజీ ఎమ్మెల్యే భరరామ్, కుచేరా మున్సిపల్ చైర్‌పర్సన్ తేజ్‌పాల్ మీర్జా, సుఖరామ్ దొడ్వాడియా ఉన్నారు. దీంతో, అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే వీరికి మద్దతు తెలుపుతూ సుమారు 400 మంది కాంగ్రెస్ కార్యకర్తలు తాజాగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా తేజ్ పాల్ మీర్జా మీడియతో మాట్లాడుతూ 'నాగౌర్‌లో కాంగ్రెస్‌ను నాశనం చేయడానికి బేనివాల్ ప్రయత్నిస్తున్నాడు. అలాంటి వ్యక్తితో పొత్తు పెట్టుకోవడం కాంగ్రెస్ కార్యకర్తలకు ఇష్టం లేదు. అందుకే వారంతా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అభ్యర్థిని ఖరారు చేసే ముందు అధిష్ఠానం మా అభిప్రాయం తెలుసుకోవాల్సింది. కాంగ్రెస్‌ను ఓడించేందుకు మాత్రమే ఆర్ఎల్‌పీ పనిచేస్తోంది' అని అన్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం తమ పార్టీ కార్యకర్తలు రాజీనామా చేయలేదన్నారు. ఇదంతా బీజేపీ నేతలు ఆడుతున్న డ్రామా అని కొట్టిపారేశారు.

## పెరిగిన మహిళా అభ్యర్థులు

### తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాల నుంచి 76 మంది పోటీ

కనిమొళి

తమిళిసై సౌందర రాజన్

విద్యారాణి

చెన్నై: లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు తమిళ మహిళలు నడుం బిగించారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాల నుంచి మొత్తం 950 మంది పోటీ చేస్తుంగా వీరిలో 76 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి పోటీ చేసే మహిళా అభ్యర్థుల సంఖ్య పెరిగింది. తమిళనాడులో మహిళలకు సీట్లు ఇచ్చే వినూత్న పంథా నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే)తో ప్రారంభమైంది. పుదుచ్చేరితో కలిపి 40 స్థానాలకుగానూ 20 మంది మహిళలకు ఆ పార్టీ అవకాశమిచ్చింది. కృష్ణగిరి స్థానానికి వీరప్పన్ కుమార్తె విద్యారాణి ఎన్టీకే తరఫున పోటీ చేస్తున్నారు. అలాగే, డీఎంకే నుంచి ముగ్గురు, అన్నాడీఎంకే నుంచి ఒకరు, ఎన్డీయే తరఫున ఆరుగురు, ఇండియా కూటమి నుంచి ఐదుగురు మహిళలు ఎన్నికల బరిలో నిలిచారు. కరూరు స్థానం నుంచి ఎక్కువ మంది మహిళలు పోటీ చేస్తున్నారు. మొత్తం ఎనిమిది మంది బరిలో నిలిచారు. సిట్టింగ్ ఎంపీగా జ్యోతిమణి ఉన్నారు. దక్షిణ చెన్నైలోనూ మహిళల మధ్యే ప్రధానంగా పోటీ జరగనుంది. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ బీజేపీ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ డీఎంకే నుంచి పోటీ చేస్తున్నారు. దక్షిణ చెన్నైలో ఐదుగురు, ధర్మపురి, తెన్‌కాశి స్థానాల్లో నలుగురు చొప్పున, ఉత్తర చెన్నై, ఈరోడ్, తిరుచ్చి, చిదంబరం, తేని, విరుదు నగర్, తూత్తుకుడి నియోజకవర్గాల్లో చెరో ముగ్గురు మహిళలు పోటీ చేస్తున్నారు. తూత్తుకుడి డీఎంకే సిట్టింగ్ ఎంపీ కనిమొళి తన నియోజకవర్గంతోపాటు ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్రంలో ప్రచారం చేస్తున్నారు. మధ్య చెన్నై, వేలూరు, విళుపురం (ఎస్సీ), సేలం, పొళ్లాచ్చి, తంజావూరు పార్లమెంటు స్థానాల్లో మాత్రం మహిళా అభ్యర్థులెవరూ పోటీలో లేరు. కన్యాకుమారి జిల్లా విలవన్‌కోడ్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ ధరణి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. 22 మంది బరిలో ఉండగా వీరిలో 10మంది మహిళలే! పార్లమెంటు స్థానాల పునర్విభజన తర్వాత మహిళా అభ్యర్థులు పెరిగారు. 2009 ఎన్నికల్లో 48 మంది మహిళలు పోటీ చేశారు. కన్యాకుమారి నుంచి డీఎంకే అభ్యర్థి జె.హెలెన్ డేవిడ్‌సన్ గెలిచారు. ఆ స్థానం నుంచి గెలిచిన తొలి మహిళగా రికార్డుకెక్కారు. 2014లో 55 మంది పోటీ చేశారు. అన్నాడీఎంకే నుంచి నలుగురు గెలుపొందారు. కె.మరకతం (కాంచీపురం-ఎస్సీ), ఆర్.వన రోజా (తిరువణ్ణామలై), వి.సత్యభామ (తిరుప్పూరు), ఎం.వాసంతి (తెన్‌కాశి-ఎస్సీ) విజేతలుగా నిలిచారు. 2019 ఎన్నికల్లో 67మంది పోటీ చేశారు కానీ ముగ్గురు మహిళలే గెలిచారు. డీఎంకే తరఫున కనిమొళి (తూత్తుకుడి), తమిళచ్చి తంగపాండియన్ (దక్షిణ చెన్నై), కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.జ్యోతిమణి (కరూరు) విజయం సాధించారు. ఈ ముగ్గురూ తాజా ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్నారు.



"సహస్రాబ్దాల మన మహోన్నత సంస్కృతికి తలవంపులు తెచ్చే ఈ సీఏఏ ఏమిటి? పీడనకు గురై మన దేశంలో శరణుకోరిన యూదులకు ఆశ్రయం ఇచ్చినట్టుగా వేదనకు గురైన శరణార్థులందరికీ ఎందుకు ఆశ్రయం ఇవ్వలేక పోతున్నాం?"

- శశిథరూర్, కాంగ్రెస్ సీనియర్ నేత



## దేవెగౌడ కంచుకోట ఎవరికో?

- అప్పుడు తాతలు... ఇప్పుడు మనవళ్ల మధ్య పోటీ
- హసన్‌లో పోరు ఆసక్తికరం
- దశాబ్దాలుగా తలపడేది ప్రముఖ రాజకీయ కుటుంబాలే

హసన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ప్రధాని దేవెగౌడ కంచుకోట హసన్‌లో పోరు ఆసక్తికరంగా మారింది. గతంలో ఇదే స్థానం నుంచి పోటీ చేసిన ఇద్దరు ప్రముఖ నేతల మనవళ్లు తాజాగా బరిలో ఉన్నారు. కర్నాటకలోని హసన్... ఒకప్పటి హోయసల సామ్రాజ్య రాజధాని. దేశానికి తొలి కన్నడిగ ప్రధానిని అందించిన నియోజకవర్గం. జేడీఎస్ అధినేత దేవెగౌడకు పెట్టని కోట. చారిత్రక వారసత్వ సంపదకు నిలయమైన ఈ ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల పోరు ఈసారి మరింత రసవత్తరంగా మారింది. గత నాలుగు దశాబ్దాలుగా రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల మధ్యే అధికార పోరు నడుస్తుండగా... తాజా ఎన్నికల్లో వారి మూడోతరం తలపడుతోంది. హసన్ నియోజకవర్గానికి దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ (33) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజా ఎన్నికల్లోనూ బీజేపీ-జేడీఎస్ కూటమి అభ్యర్థిగా ఆయనే మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రజ్వల్‌కు ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ శ్రేయస్ ఎం.పటేల్ (31)ను నిలబెట్టింది. ఈయన కర్నాటక మాజీమంత్రి, దివంగత జి.పుట్టస్వామి గౌడ మనవడు. గతంలో ఇదే స్థానం నుంచి దేవెగౌడ, పుట్టస్వామి పోటీ చేయగా... ఇప్పుడు వారి మనవళ్లు బరిలోకి దిగడం విశేషం.

1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హోళెనరసిపుర స్థానం నుంచి అప్పటి జనతా పార్టీ అభ్యర్థిగా దేవెగౌడ పోటీ చేయగా... ఆయనపై తొలిసారి పుట్టస్వామి నిలబడ్డారు. కాంగ్రెస్ టికెట్ నిరాకరించినప్పటికీ స్వతంత్రుడిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే, 1989లో జరిగిన ఎన్నికల్లో అదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి దేవెగౌడను ఓడించారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో హసన్ నుంచి దేవెగౌడపై పోటీ చేసి విజయం సాధించారు. అయితే, ఆ తర్వాత మళ్లీ సార్వత్రిక ఎన్నికల్లో ఆయన గెలుపొందలేకపోయారు.

హసన్ నియోజకవర్గం దేవెగౌడ కుటుంబానికి కంచుకోట లాంటిది. రాజకీయంగా పుట్టస్వామి కుటుంబంపై వీరిదే ఆధిపత్యం. 1994, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి హోళెనరసిపుర శాసనసభ స్థానం నుంచి పోటీ చేసినప్పటికీ... దేవెగౌడ పెద్ద కుమారుడు హెచ్.డి. రేవణ్ణ చేతిలో పరాజయం పాలయ్యారు. అనంతరం 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి కోడలు ఎస్.జి.అనుపమను నిలబెట్టినా ఓటమి తప్పలేదు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టస్వామి మనవడు శ్రేయస్ పటేల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా కేవలం 3,152 ఓట్ల తేడాతో రేవణ్ణ చేతిలో ఓడిపోయారు.

### మనవడి కోసం మాజీ ప్రధాని త్యాగం

హసన్ లోక్‌సభ స్థానం నుంచి దేవెగౌడ ఐదుసార్లు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మనవడి కోసం ఈ స్థానాన్ని త్యాగం చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్-జేడీఎస్ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన ప్రజ్వల్ 1.41లక్షల మెజార్టీతో విజయం సాధించారు. జేడీఎస్ తరఫున ఆ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ఎంపీ ఆయనే. కర్నాటకలో సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత జేడీఎస్-బీజేపీ జట్టుకట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా ప్రజ్వల్ మరోసారి బరిలోకి దిగారు.

### వక్కలిగల మద్దతు ఎవరికో?

కర్నాటకలో లింగాయత్‌ల తర్వాత రెండో అతిపెద్ద సామాజిక వర్గం అయిన వక్కలిగల ప్రాబల్యం హసన్‌లో చాలా ఎక్కువ. ఈ రెండు కుటుంబాలు ఇదే సామాజిక వర్గానికి చెందినవే అయినా ఉప కులాలు వేరు. పుట్టస్వామి దాస వక్కలిగ కాగా.. దేవెగౌడ కుటుంబానిది ముల్లు వక్కలిగ వర్గం. హసన్ నియోజకవర్గంలో దాస వక్కలిగ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉండటం శ్రేయస్ పటేల్‌కు కలిసొచ్చే అంశం. దీంతో 1999 నాటి తన తాత విజయాన్ని పునరావృతం చేయగలనని ఈయన ధీమాగా ఉన్నారు. ఇక ప్రజ్వల్‌పై స్థానికంగా కొంత వ్యతిరేకత ఉంది. అవినీతి ఆరోపణలతో పాటు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం జేడీఎస్‌లో కొందరికి రుచించలేదు. అయితే, కుటుంబ ప్రాబల్యంతో పాటు మోదీ పాపులారిటీతో కాషాయ ఓటు బ్యాంకు కూడా తనకు దక్కుతుందని ఈ యువ ఎంపీ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. హసన్ పరిధిలో మొత్తం ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగుచోట్ల జేడీఎస్ అధికారంలో ఉండగా... బీజేపీ, కాంగ్రెస్‌కు చెరో రెండు స్థానాలున్నాయి. ఈ స్థానానికి ఈ నెల 26న పోలింగ్ జరగనుంది. దేవెగౌడ 'కోట' వీరిద్దరిలో ఈసారి ఎవరికి దక్కుతుందో జూన్ నాలుగో తేదీ వరకు వేచి చూడాల్సిందే.

# కమ్యూనిస్టుల కోట కడప



కరువు సీమలో కమ్యూనిస్టుల హవా సాగిన కడప జిల్లాలో సీపీఐ ప్రజల పక్షాన వహించిన పోరాటం ఘట్టాలు జిల్లా రాజకీయ చరిత్రలో చెరగని పేజీలుగా నిలిచాయి.
రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పార్లమెంటు స్థానాల్లో ఎక్కడా లేని విధంగా కడప పార్లమెంటు కమ్యూనిస్టులకు పెట్టని కోటగా మలచి వారి ప్రజా పోరాటాలకు ప్రజలు బాసటగా నిలిచారు .ఆ నేపథ్యమే ఇక్కడ పార్లమెంటులో కమ్యూనిస్టు యోధుడు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి నాలుగు సార్లు పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించారు. అంతటి ప్రాతినిధ్యం ఉన్న నాటి కమ్యూనిస్టుల కోటలో కాలు మోపిన వైఎస్ కుటుంబం 1989 నుంచి 2009 వరకు తొమ్మిది సార్లు జరిగిన ఎన్నికల్లో వరస విజయాలు సాధిస్తూ పాగా కొనసాగిసున్నది. ఈ ఎన్నికల్లో కూడా ఆ కుటుంబ సభ్యులు ప్రస్తుత ఎంపీ అవినాశ్ రెడ్డి వైసీపీ నుంచి బరిలో ఉండగా, కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా పదో సారి కడప పార్లమెంటు వైఎస్ కుటుంబానికి సొంతం అవుతుంది. కడప పార్లమెంట్‌లో వారిదీ ఓ చరిత్ర అవుతుంది.

- ఎంపీగా నాలుగుసార్లు గెలిచిన ఎద్దుల ఈశ్వర్ రెడ్డి
- హ్యాట్రిక్ కొట్టిన కమ్యూనిస్టు యోధుడు
- 1989 నుంచి వైఎస్ కుటుంబ ప్రస్తానం ప్రారంభం

కడప పార్లమెంటు నియోజకవర్గ చరిత్రలో కమ్యూనిస్టు యోధుడు ఎద్దుల ఈశ్వర్ రెడ్డిది ఒక ప్రత్యేక ప్రస్థానం . పార్లమెంటు ఏర్పడ్డాక 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో ఆయన సీపీఐ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థి వి ఆర్ రెడ్డి ఎన్నికగా ఎద్దుల ఈశ్వర్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 1962 ,1967 1971 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో ఎద్దుల ఈశ్వర్ రెడ్డి సీపీఐ తరపున వరుస విజయాలు సాధిస్తూ వచ్చారు. అప్పటిదాకా కడప పార్లమెంటు కమ్యూనిస్టు కోటగా ఆ పార్టీకి విజయాలను అందిస్తూ వచ్చింది.

కమ్యూనిస్టు యోధుడు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి తర్వాత 1977లో కాంగ్రెస్ పార్టీ నుంచి కందులు ఓబుల్ రెడ్డి గెలుపొందారు.1980 లోనూ ఆయనే కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత 1984 లో జరిగిన ఎన్నికల్లో పులివెందులకు చెందిన డీఎన్ రెడ్డి టీడీపీ నుంచి పోటీ చేసి కందుల ఓబుల్ రెడ్డి పై గెలుపొందారు . ఆ తర్వాత 1989 నుంచి వైఎస్ కుటుంబ ప్రస్తానం మొదలైంది. 1989లో మొదటి సారి ఎంపీగా పోటీ చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, 1991,1996, 1998 ఎన్నికల్లో వరుసగా పోటీ చేసి ప్రత్యర్థులపై విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ సోదరుడు వైఎస్ వివేకానంద రెడ్డి పోటీ చేశారు ,2004 ఎన్నికల్లో కూడా ఆయనే పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ అరంగేట్రం చేసి కడప పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో జగన్ మోహన్‌రెడ్డి వైసీపీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ ఏర్పడిన తర్వాత 2014 ,2019 ఎన్నికల్లో ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ, కడప పార్లమెంటు వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్ రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. ఇలా ఈ కుటుంబం వరుసగా తొమ్మిది సార్లు విజయం సాధించి కడప పార్లమెంటు నియోజకవర్గంలో తమ ప్రాబల్యానికి ఎదురు లేదని నిరూపించారు. పదో సారి పార్లమెంట్ ఎన్నికల బరిలో వైఎస్ కుటుంబీకులే ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నారు. కాకపోతే గతంలో ఆ కుటుంబం నుంచి ఒకరు మాత్రమే పార్లమెంటుకు పోటీ చేస్తుండగా వైఎస్ కుటుంబంలో ఏర్పడ్డ విభేదాలు, రాజకీయ అగాధాల నేపథ్యంలో ఇప్పుడు ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో జగన్ బాబాయి వైఎస్ భాస్కర్ రెడ్డి కుమారుడు అవినాశ్ రెడ్డి వైసీపీ నుంచి పోటీ చేస్తుండగా, జగన్ సొంత సోదరి షర్మిలారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి అక్క, తమ్ముడు పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండడం ఆసక్తికరంగా మారింది. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్సీ దేవుడి నారాయణరెడ్డి కుమారుడు భూపేష్ రెడ్డి పోటీ చేస్తున్నారు. త్రిముఖ పోటీలో విజయం వైఎస్ కుటుంబంలో షర్మిల, లేదా అవినాశ్ రెడ్డిలో విజయం ఎవరిని వరించినా వైఎస్ కుటుంబానికి పదోసారి అవకాశం దక్కుతుంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే రెండోసారి ఆ పార్లమెంట్ నుంచి గెలుపు అవకాశం దక్కుతుంది.

ఈశ్వర్ రెడ్డి

– విశాలాంధ్ర బ్యూరో – కడప



## పార్లమెంటుకు సభాపతిని అందించిన అమలాపురం

1998లో అమలాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన గంటి మోహన చంద్ర బాలయోగి పార్లమెంటు సభాపతిగా ఎన్నికయ్యారు. 1999లో కూడా ఆ పదివి ఆయనకే దక్కింది. ఆ పదవిలో కొనసాగుతూనే హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆ తర్వాత 2012లో జరిగిన ఉప ఎన్నికలో ఆయన సతీమణి గంటి విజయకుమారి అమలాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున ఎంపీగా గెలుపొందారు. 1991లో కూడా బాలయోగి అమలాపురం నియోజకవర్గం నుంచే టీడీపీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1996 నాటి ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్లమెంటు ఎన్నికల్లోకి వచ్చారు.

# పెరుగుతున్న నోటా

- 2019లో 1.28 శాతం నమోదు
- అధినేతల ఇలాకాలో భారీ ఓట్లు

నోటా నొక్కే ఓటర్లు క్రమేపీ పెరుగుతున్నారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లాక ఎవరికీ ఓటేసేందుకు ఆసక్తి లేకపోవడంతో కొందరిచూపు నోటాపైనే పడుతున్నది. గతంలో అభ్యర్థుల పనితీరు నచ్చక ఓటు వేసేందుకు ఆసక్తిలేక ఇంటికే పరిమితమయ్యేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి నోటా బటన్ నొకుతున్నారు కొందరు ఓటర్లు... దేశంతోపాటు రాష్ట్రంలోనూ నోటా ఓట్లు పెరగడం ప్రధాన పార్టీలకు ఆందోళన కలిగిస్తున్నది. సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థులకు నోటా ఓటు వెంటాడుతున్నది. గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల నుంచి పట్టణాల వరకు నోటాకు ఓట్లు పెరుగుతున్నాయి. అధినేతల నుంచి అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలోను నోటా ఓట్లు వేస్తున్నారు. అభ్యర్థులు ఎవరూ నచ్చకుంటే నోటా ఓటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఐచ్ఛికం ఇవ్వడంతో దీనిని ఓటర్లు అధికంగా వినియోగించుకుంటున్నారు. నోటా (నన్ ఆఫ్ ది అబవ్)ను 2009లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా 2013లో ప్రయోగాత్మకంగా చత్తీస్‌గఢ్, మిజోరం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అమలు చేయగా 1.85 శాతం ఓట్లు లభించాయి. అనంతర ఎన్నికల్లో పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చింది. అన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లలో నోటా ఉంటుంది. ఈ నోటా వినియోగం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో క్రమేపీ పెరుగుతున్నాయి. ఇందుకు గత ఎన్నికల ఫలితాలే రుజువు చేస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలకు నోటా కింద మొత్తం 0.5శాతం ఓట్లు నమోదయ్యాయి. అనగా 1,56,121 ఓట్లు నోటాకు లభించాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో నోటా ఓట్ల శాతం పెరిగింది. అసెంబ్లీ స్థానాలకు నోటా ఓట్లు 1.28 శాతం నమోదుకాగా, 3.98లక్షల ఓట్లు వచ్చాయి. పార్లమెంటుకు 1.5శాతం నోటా ఓట్లు నమోదై, 4.65లక్షల ఓట్లు నోటాకు వచ్చాయి. ప్రతి నియోజకవర్గంలోనూ సింగిల్ డిజిట్ నుంచి నాలుగు అంకెల వరకు నోటా ఓట్లు పోలయ్యాయి. ఈ నోటా ఓట్లు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు వెళ్తే, గెలుపు ఓటములు తారుమారయ్యే అవకాశం ఉంటుంది. దీని ప్రకారం తాజా ఎన్నికల్లో నోటా ఓట్ల శాతం పెరిగే పరిస్థితి ఉంది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీల అధినేతలు పోటీ చేసిన నియోజకవర్గాల్లోనూ నోటా రుచి చూపించింది. నోటాకు 1.28 శాతం ఓట్లు నమోదు కాగా, బీజేపీకి మొత్తం ఓట్ల శాతం 0.84 శాతమే నమోదైంది. అంటే నోటా కంటే బీజేపీకి తక్కువగా ఓట్లు వచ్చాయి. 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ ఓడిపోయింది. వాటితోపాటు వివిధ పార్టీల అధినేతలు, సీనియర్ నాయకులు పోటీ చేసిన నియోజకవర్గాల్లోను నోటా ఓట్లు అధికంగా నమోదయ్యాయి. 2019లో సీఎంగా ఉన్న చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో 2,905 (1.6శాతం) నోటా ఓట్లు వచ్చాయి. అప్పటి పతిపక్షం వైసీపీ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో 2,160 (1.19శాతం) నోటా ఓట్లు వచ్చాయి. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన గాజువాకలో 1,764 ఓట్లు (.0.88శాతం), భీమవరంలో 1,492(0.72శాతం) ఓట్లు వచ్చాయి. టీడీపీ నేత అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గమైన టెక్కలిలో నోటా ఓట్లు 2,935(1.66శాతం)గా నమోదు కాగా చింతమనేని ప్రభాకర్ పోటీ చేసిన దెందులూరులో 2,546 (12.3శాతం), బాలకృష్ణ పోటీ చేసిన హిందూపురంలో 1,250(0.72శాతం) నమోదయ్యాయి. వైసీపీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లి 3,553(2.02శాతం), ధర్మాన ప్రసాదరావు పోటీ చేసిన శ్రీకాకుళం 3,082 ఓట్లు(1.73శాతం), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పోటీ చేసిన గుడివాడ 3,285 (1.95), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గమైన పుంగనూరు 3287 (1.67శాతం) చొప్పున నోటా ఓట్లు పోలాయ్యాయి.

– విశాలాంధ్ర బ్యూరో–అమరావతి




కార్మిక, కర్షక పక్షపాతి

## కోడుగంటి గోవిందరావు

ఆదర్శ ప్రతినిధి

**కార్మిక, కర్షక, ప్రజాఉద్యమాలే దోపిడీ నుంచి విముక్తికి మార్గమని నమ్మి... పోరాటాలు సాగించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న వారిలో కోడుగంటి గోవిందరావు ఒకరు. ఆయన విశాఖ జిల్లా అనకాపల్లి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు.**



ప్రజా ఉద్యమాల చరిత్ర గల అనకాపల్లి గడ్డపై 1923 మార్చి 31న కోడుగంటి రామదాసు, వెంకుమాంబ దంపతులకు గోవిందరావు జన్మించారు. బాల్యం నుంచే అభ్యుదయ, ఆదర్శ భావాలు పుణికి పుచ్చుకున్న ఆయన సహాయనిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా తదితర ఉద్యమాలలో పాల్గొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీల కార్యకర్తగా ఎదిగారు. 1952 ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అనకాపల్లి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత దక్కించుకున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వం గోవిందరావును అరెస్టు చేసింది. ఆలీపూర్ జైల్లో ఆరునెలలపాటు ఉన్నారు. పోలీసుల లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడ్డారు. 1944–45 మధ్య ఉత్తర విశాఖ జిల్లా కరవు బారినపడింది. అప్పుడు గోవిందరావు ఆధ్వర్యంలో కరవు నివారణ సంఘం స్థాపించి ఊరూరా తిరిగి విరాళాలు సేకరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ అర్గనైజర్‌గా అనకాపల్లి ప్రాంతంలో పని చేసి, రైతు సంఘాలను ఏర్పాటు చేసి, రైతు సమస్యలపై పోరాటాలు సాగించారు. ఈ కాలంలో రహస్య జీవితాన్ని గడపాల్సి వచ్చింది. మారువేషాల్లో పర్యటిస్తూ గ్రామాల్లో రైతులను చైతన్యవంతులను చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ గోవిందరావు ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. దాని ఫలితంగానే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అసెంబ్లీకి 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి నుంచి సీపీఐ తరపున పోటీ చేసి 6,662 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

1955లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా మిగతా పార్టీలన్నీ ఏకంకావడంతో ఆ ఎన్నికల్లో గోవిందరావు స్వల్ప తేడాలో ఓడిపోయారు.ఆ తర్వాత 1962లో అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఈసారి అనకాపల్లి నుంచి పోటీ చేసిన గోవిందరావు 12 వేల మెజారిటీతో ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేడ అచ్చన్నాయుడుపై ఘనవిజయం సాధించారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోయింది. ఈ నేపథ్యంలో 1967లో అసెంబ్లీకి నాలుగోసారి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అనకాపల్లి నుంచి సీపీఐ అభ్యర్థిగా గోవిందరావు స్థానం ప్రజల హృదయాల్లో నిండుగా ఉందని నిరూపితమైంది. మరలా 1978లో జరిగిన ఎన్నికల్లో కూడా గోవిందరావే విజయం సాధించారు. శాసనసభలో వెనుకబడిన విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించిన సమస్యలపై ముఖ్యంగా రైతాంగ సమస్యల గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావడంలో విశేష కృషి చేశారు. అభ్యుదయం, ఆదర్శం, నిజాయితీలు ఆభరణాలుగా ధరించిన గోవిందరావు 2014 ఫిబ్రవరి 18న కన్నుమూశారు.